RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 04 నవంబర్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:134

పేదలను దోచుకుంది బీఆర్ఎస్సే

తొమ్మిదిన్నరేళ్లు రాజ్యాన్ని ఏలి పేదోళ్ల కష్టాలు పట్టించుకోకుండా... ప్రజాధనాన్ని లూటీ చేసింది, ప్రజలను పేదవాళ్లని చేసింది నాటి దొరలేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.



హైదరాబాద్, ఖమ్మం రూరల్, బచ్చన్నపేట, నవంబరు 3 తొమ్మిదిన్నరేళ్లు రాజ్యాన్ని ఏలి పేదోళ్ల కష్టాలు పట్టించుకోకుండా... ప్రజాధనాన్ని లూటీ చేసింది, ప్రజలను పేదవాళ్లని చేసింది నాటి దొరలేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలోని 14, 15, 16 వార్డులు, తెల్దారుపల్లి గ్రామంలో రూ.3కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వరి వేస్తే ఉరే అనిఅందని, కానీ తమ ప్రజా ప్రభుత్వం వరి వేసిన రైతులకు బోనస్ ఇచ్చి ఆర్థికంగా ప్రోత్సహిస్తోందన్నారు. నాటి ప్రభుత్వ పెద్దలు స్వలాభం కోసం రాష్ట్ర సొత్తును కొల్లగొట్టారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతీ పేదింటికి సంక్షేమ ఫలాలను అందిస్తోందని, ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో రూ.40వేల కోట్లతో అర్హులైన పేదలకు 8లక్షల ఇళ్లను ఇచ్చామన్నారు.

120 ఏళ్ల క్రితం భూముల సర్వేలు జరిగాయని.. మళ్లీ ప్రజా ప్రభుత్వంలో భూముల సమగ్ర సర్వే చేసి అర్హులైన రైతులందరికీ భూధార్ కార్డులు అందజేస్తున్నామన్నారు. పాలేరు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో భూ సర్వే చేయాలని ఖమ్మం కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. మ్యాపులతో కూడిన సర్వేతో భూధార్ కార్డులను ప్రతీ భూహక్కుదారుకు ఇస్తామన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు రూ.40కోట్ల వరకు అభివృద్ధి పనులు చేశామని, తెల్దారుపల్లి ప్రజల కోసం నాగార్జునసాగర్ కాల్వపై రూ.5కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, రెవెన్యూ, హౌసింగ్, భూ సర్వే శాఖలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకునేందురు జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పొంగులేటి పేర్కొన్నారు. ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. బుధవారం శామీర్‌పేటలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉద్యమకారుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల కుటుంబం తమ పాలనలో... ప్రజలకు, ఉద్యమకారులకు చేసింది శూన్యమని పొంగులేటి ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. 'ఉద్యమంలోకి వెళ్లి జీవితం పాడు చేసుకున్నా' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని ఎక్స్‌లో ట్యాగ్ చేస్తూ పైవిధంగా స్పందించారు. ఒకప్పుడు ఎకరం భూమి కూడా లేని స్థితిలో ఉన్న కల్వకుంట్ల కుటుంబం రూ.కోట్ల కొద్దీ అక్రమ సంపదను కూడబెట్టుకుంటూ, విలాసవంతమైన ఫాంహచి?సలు నిర్మించుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఉద్యమకారుల జీవితాలు బాగుపడలేదంటూ... అప్పుల బాధ తట్టుకోలేక బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త తెలిసి మనస్తాపం కలిగిందన్నారు.

కేంద్ర పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి

కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో రాబట్టేందుకు కృషి చేయాలి

కేంద్ర ప్రాయోజిత పథకాల లక్ష్యాలు నెరవేరాలి.. ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందాలి

కేంద్ర శాఖలతో నిరంతర సమన్వయం చేసుకోవాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మిగతా 2 లో

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేంద్ర పథకాల కింద కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ఆశించిన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర ప్రభుత్వ సెక్టార్, సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ అమలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు, పెండింగ్ బిల్లులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నుంచి నిధులు పొందేందుకు ఉన్న అన్ని అవకాశాలను శాఖలవారీగా గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను సకాలంలో సమర్పించాలని సూచించారు.

మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు ఏఐతో చెక్

మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు



హైదరాబాద్ మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పంటల కొనుగోళ్లు, విక్రయాల్లో పారదర్శకత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ ఆధారిత డిజిటల్ వ్యవస్థను రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి లావాదేవీ పారదర్శకంగా జరిగేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం ఐటీ శాఖ సమన్వయంతో వారం రోజుల్లోగా టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టం చేశారు.సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ యార్డుల ఆధునికీకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డుకు రైతు వచ్చినప్పటి నుంచి పంట విక్రయ ప్రక్రియ పూర్తయ్యే వరకు జరిగే ప్రతి దశను ఒకే డిజిటల్ వేదికపై నమోదు చేయాలని ఆదేశించారు. యార్డుకు వచ్చిన రైతుల వివరాలు, వారు తీసుకొచ్చిన పంట పరిమాణం, నాణ్యత, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్ల కార్యకలాపాలు, వేలం ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా వ్యవస్థను రూపొందించాలన్నారు.డిజిటల్ విధానం ద్వారా మార్కెట్ యార్డుల్లో జరిగే లావాదేవీలను పర్యవేక్షించడంతో పాటు అక్రమాలు, అవకతవకలకు అవకాశాలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంటల తూకం, ధర నిర్ణయం, వేలం, విక్రయాలకు సంబంధించిన వివరాలు ఒకే వేదికపై నమోదైతే రైతులకు మరింత స్పష్టత లభించే అవకాశం ఉంటుంది. ఏ దశలోనూ సమాచారం దాచిపెట్టకుండా, సంబంధిత వివరాలను అధికారులు పర్యవేక్షించేలా సాంకేతిక వ్యవస్థను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ అమల్లోకి వస్తే రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ల నిర్వహణలో సాంకేతిక మార్పులకు మార్గం సుగమం కానుంది.మరోవైపు హైదరాబాద్ శివార్లలో నిర్మిస్తున్న కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ పనుల పురోగతిపైనా సమావేశంలో చర్చించారు. నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై తుమ్మల అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పండ్ల రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, పంటల విక్రయాల్లో మధ్యవర్తుల ప్రభావాన్ని తగ్గించడం, మార్కెట్ మౌలిక వసతులను ఆధునికీకరించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది.

డెమోక్రాట్లు గెలిస్తే 'మిస్టర్ వీటో'గా మారిపోతా..

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

డెమోక్రాట్లు గెలిస్తే అన్ని నిర్ణయాలను వీటో చేస్తానన్న ట్రంప్

మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయాలని ఉందని వ్యాఖ్య

రాజ్యాంగం ప్రకారం మూడోసారి ఎన్నిక కావడం సాధ్యం కాదని అంగీకారం

తన సిబ్బందిపై విచారణలు జరిగితే ముందస్తు క్షమాభిక్షలు ఇస్తానని వెల్లడి

డెమోక్రాట్లకు అనుకూలంగా ఉన్నాయంటూ సర్వేలను తప్పుబట్టిన ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే వారి ప్రతిపాదనలన్నింటినీ వీటో చేస్తానని హెచ్చరించారు. మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని, అయితే రాజ్యాంగ నిబంధనలు అందుకు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నారు. న్యూయార్క్ పోస్ట్ కాలమిస్ట్ మిరాండా డివైన్‌తో 'పాడ్ ఫోర్స్ వన్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ ఓటమి ఎదురైతే.. 'మిస్టర్ వీటో'గా మారతానని అన్నారు. నెల లేదా రెండు నెలల పాటు వరుసగా వీటోలు వేస్తే డెమోక్రాట్లు చర్చలకు వచ్చి ఒప్పందానికి అంగీకరిస్తారని వ్యాఖ్యానించారు. మూడోసారి పోటీపై ఆసక్తి: మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం వస్తే తప్పకుండా బరిలో ఉండాలని ఉందని ట్రంప్ చెప్పారు. అయితే రాజ్యాంగంలోని నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయని అంగీకరించారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా ఎన్నికవడానికి వీల్లేదు. ట్రంప్ 2016, 2024 ఎన్నికల్లో విజయం సాధించారు.ముందస్తు క్షమాభిక్షలు ఇస్తా: కాంగ్రెస్‌పై డెమోక్రాట్లు పట్టు సాధించి తనకు పనిచేసినవారిపై విచారణలు ప్రారంభిస్తే.. వారికి ముందస్తు క్షమాభిక్షలు ఇచ్చేందుకు సిద్ధమని ట్రంప్ వెల్లడించారు. గతంలో జనవరి 6 ఘటనకు సంబంధించి క్షమాభిక్షలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.డెమోక్రాట్లు ఆధిక్యంలో ఉన్నట్లు వెల్లడిస్తున్న సర్వేలను ట్రంప్ కొట్టిపారేశారు. అవి పక్షపాతంతో ఉన్నాయని ఆరోపించారు. రిపబ్లికన్లను సరిగా సర్వే చేయడం లేదని విమర్శించారు. డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్‌తో పాటు భవిష్యత్తులో అధ్యక్ష పదవినీ గెలుచుకుంటే దేశం అంతమవుతుందని హెచ్చరించారు.

మియాపూర్ 550 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడాలి: వామపక్ష పార్టీల డిమాండ్

స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్‌లలో సీపీఐ(ఎమ్), సీపీఐ(ఎమ్-ఎమ్) మరియు ఎంసీపీఐ(యు) నాయకుల విస్తృత పర్యటన.. మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 100 మరియు 101 లో ఉన్న 550 ఎకరాల అత్యంత ఖరీదైన భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) చారిత్రాత్మక తీర్పునిచ్చిన నేపథ్యంలో, ఈ భూములపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

భూ పరిధిలో ఉన్న పేదల నివాస ప్రాంతాలైన స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్ ప్రజలను పరామర్శించేందుకు, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకత్వం మరియు ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గం పర్యటించాయి.

ప్రజాబలం

04 నవంబర్ 2026 బుధవారం

అల్పపీడనం నుంచి సూపర్ తుపాను వరకు?

మురసు.. అర్నబ్.. హుద్ హుద్.. తిత్లీ.. మొంథా.. ఒగ్ని.. ఈ పేర్లు వినే ఉంటారు కదా..!గత కొన్నేళ్లలో వచ్చిన తుపానుల పేర్లు ఇవి.వీటన్నింటికీ ఒక పోలిక ఉంది. అదేంటని అనుకుంటున్నారా?! ఇవన్నీ అక్టోబరు, నవంబరు నెలలో సంభవించాయి. ఏటా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపానులలో ఎక్కువగా ఈ రెండు నెలల్లోనే ఉంటున్నాయని భారత వాతావరణ శాఖ చెబుతోంది.ఇంతకీ అక్టోబరు, నవంబరు నెలల్లోనే ఎక్కువగా తుపానులు ఏర్పడ్డానికి కారణమేమిటనే విషయంపై భారత వాతావరణ శాఖ, ఇన్ కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఒషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) ఈ తుపానులు ఏర్పడటంలో సముద్ర ఉష్ణోగ్రతలు కీలక పాత్ర పోషిస్తాయని అని ఇన్ కాయిస్ శాస్త్రవేత్త బి.శివయ్య చెప్పారు.భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. 1891 నుంచి 2025 మధ్య బంగాళాఖాతంలో వాయుగుండాలు, తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 1261 ఏర్పడ్డాయి.వీటిల్లో ఎక్కువగా రెండు నెలల కాలంలో.. అంటే అక్టోబరు, నవంబరులోనే వచ్చాయి.అంతేకాదు, ఈ రెండు నెలల్లో వచ్చే తుపానుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంది. బంగాళాఖాతంలో 1891 నుంచి 2025 వరకు తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 541 వచ్చినట్లుగా భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇందులో అక్టోబరులో 96, నవంబరులో 126లో ఏర్పడ్డాయి.అలాగే 1891 నుంచి 2025 మధ్య తీవ్ర తుపానులు 247 ఏర్పడగా.. అక్టోబరులో 44, నవంబరులో 76 వచ్చాయి. తుపానుల విషయంలో సముద్ర ఉష్ణోగ్రతలలు, గాలుల గమనం తీరు కీలకంగా మారతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.నైరుతి రుతుపవనాల తిరోగమనం(పోస్ట్ మాన్ సూన్) తర్వాత తుపానులు ఎక్కువగా తూర్పు తీరం వైపున ఏర్పడుతుంటాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న చెప్పారు.”పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు అండమాన్ కింద నుంచి బంగాళాఖాతంలోకి వచ్చి చేరుతుంటాయి.రుతుపవనాల ముందు మయన్మార్ తీరంలో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుంటాయి. దానివల్ల అటువైపు తుపానులు వెళుతుంటాయి.కానీ, రుతుపవనాల తిరోగమనం తర్వాత బంగాళాఖాతంలో తూర్పు తీరంవైపు సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. దానివల్ల తూర్పు తీరంవైపు తుపానుల గమనం ఉంటుంది. ఇందుకు గాలుల గమనం కూడా సహకరిస్తుంది ” అని చెప్పారు నాగరత్న.ఈ సమయంలో బంగాళాఖాతంలో సముద్రపు ఉష్ణోగ్రతలు సగటున 26.5 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటాయని వివరించారు.”సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు రెండు సీజన్లలో ఎక్కువగా రికార్డవుతుంటాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఒకసారి? అక్టోబరు, నవంబరు సీజన్లలో మరోసారి ఎక్కువగా ఉంటాయి” అని బి.శివయ్య చెప్పారు.రుతుపవనాల తర్వాత శీతాకాలం వచ్చి సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గడానికి కొంత ఆలస్యం అవుతుందని వివరించారు.ఈ పరిస్థితులతో అల్పపీడన ద్రోణి ఏర్పడటానికి పరిస్థితులు సహకరిస్తాయి” అని చెప్పారు.బంగాళాఖాతంలో ఏర్పడే తుపానులు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా తీరం దాటడాన్ని గమనిస్తుంటాం.ఆంధ్రప్రదేశ్‌కు 1053.07 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరం ఉండగా, ఒడిశాకు 574.71 కిలోమీటర్ల పొడవైన తీరం ఉంది.తీరం పొడవు, తీరంలోని పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ వద్ద తుపానులు ఎక్కువగా తీరం దాటుతుంటాయని చెప్పారు నాగరత్న.”మచిలీపట్నం, నరసాపురం, కాకినాడ వద్ద తీరంలో మలుపులు ఉంటాయి.గోదావరి, కృష్ణా నదులు కలిసే ప్రాంతాలున్నాయి.తీరంలో ఉండే మలుపులు, సముద్రంలో నదులు కలిసే ప్రాంతాలు కూడా తుపానులను ఆకర్షించడానికి కారణమవుతాయి” అని వివరించారు.2026 అక్టోబరు.. అర్నబ్ అతి తీవ్ర తుపాను.. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపురం సమీపంలో తీరం దాటింది. ఏపీపై పెను ప్రభావం చూపించింది.2026 నవంబరు.. మురసు తీవ్ర తుపాను.. ఇది ఆంధ్రప్రదేశ్ తీరంలోని నెల్లూరు సమీపంలో తీరం దాటింది.2014 అక్టోబరు.. హుద్ హుద్ తీవ్ర తుపాను.. ఏపీలో విశాఖపట్నంపై విరుచుకుపడింది.ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రికార్డుల ప్రకారం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పెను విధ్వంసం సృష్టించింది.ఇవేకాకుండా, ఏపీ చరిత్రలో అత్యంత తీవ్రమైన తుపానుగా కోస్తా తీర ప్రాంతవాసులు చెప్పుకొనే దివిసీమ తుపాను లేదా దివిసీమ ఉప్పెన కూడా 1977 నవంబరులోనే వచ్చింది.ఈ తుపాను కారణంగా 24 లక్షల మంది ప్రభావితం అయ్యారు. పదివేల మందికిపైగా చనిపోయారని అంచనా.1996 కాకినాడలో వచ్చిన తుపాను కూడా నవంబరు నెలలో సంభవించింది.2012లో కోస్తా జిల్లాలను కుదిపివేసిన నీలం తుపాను కూడా నవంబరులోనే సంభవించింది.సముద్రంలో ఏర్పడే అల్పపీడన ద్రోణి బలపడితే వాయుగుండగా మారుతుంది. వాయుగుండం బలపడి తీవ్ర వాయుగుండం.. ఆ తర్వాత తుపానుగా మారుతుంది.తుపానులలో గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుందని భారత వాతావరణ శాఖ చెబుతుంది.ప్రభావాన్ని బట్టి తుపాను లేదా తీవ్ర తుపాను లేదా అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ వర్గీకరిస్తుంది. గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుంది.గంటకు 31 కిలోమీటర్ల కంటే తక్కువగా గాలుల వేగం ఉంటే అల్పపీడన ద్రోణిగా పరిగణిస్తారు.గంటకు 31-49 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే వాయుగుండం, 50-61 కిలోమీటర్ల వేగం ఉంటే తీవ్ర వాయుగుండంగా పిలుస్తారు.గంటకు 62-88 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తుపాను, 89-117 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తీవ్ర తుపాను, 118-167 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ చెబుతుంది.అదే 168-221 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అత్యంత తీవ్రమైన తుపాను, 222 కిలోమీటర్లకు పైబడి గాలులు వస్తే సూపర్ తుపానుగా చెబుతారు.

కేంద్ర పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి



మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ పథకాల మార్గదర్శకాలను పరిశీలించి, అర్హతలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని, కేంద్ర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిధుల సాధనకు కృషి చేయాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి గరిష్ఠ స్థాయిలో నిధులు రాబట్టుకోవాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగం, పురోగతిని సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి.. కేంద్రం కేటాయించిన నిధులను సమర్థవంతంగా ఖర్చు చేయడంతో పాటు, వాటి ద్వారా ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం నిధులను సమకూరుస్తున్నందున, నిధుల ఖర్చుపైనే కాకుండా వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న లైజన్ అధికారుల సేవలను అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి నిధుల విడుదల సాధించడంతో పాటు, పెండింగ్ అంశాల పరిష్కారానికి వారితో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వివిధ కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో ప్రస్తావించిన అంశాలపై కూడా సకాలంలో తదుపరి చర్యలు తీసుకుంటూ, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆదేశించారు. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు కేంద్రం అందించే ప్రత్యేక సహాయ పథకం (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) వంటి కేంద్ర కార్యక్రమాలను రాష్ట్రం గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. పథకాల అమలుకు ఆటంకంగా ఉన్న పెండింగ్ సమస్యలు, సాంకేతికపరమైన ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా నీటిపారుదల, పట్టణాభివృద్ధి, రవాణా, వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖలు కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తద్వారా ఆయా పథకాల కొనసాగింపునకు, అదనపు నిధుల సాధనకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులను సకాలంలో విడుదల చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను కూడా పరిష్కరించామని చెప్పారు. అన్ని బిల్లులను క్రమశిక్షణతో క్లియర్ చేస్తున్నామని వివరించారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల ప్రస్తుత పరిస్థితి, పురోగతి, నిధుల వినియోగంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

కాంగ్రెస్‌ను విమర్శించడానికే అమిత్ షా హైదరాబాద్ పర్యటన పరిమితం..

తెలంగాణ విభజన హామీలపై ఎందుకు మాట్లాడలేదు?

- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ కాంగ్రెస్ ను విమర్శించడానికి మాత్రమే అమిత్ షా పర్యటన పరిమితం చేసుకున్నారు. తెలంగాణ విభజన హామీలు ,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై మీరు విమర్శించిన తీరుపై కూడా స్పందిస్తారని అనుకున్న. కాంగ్రెస్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు .. మేము అధికారంలోకి రావాలని చెప్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అరోపించారు. చొరబాటు దారులకు ఓటు హక్కు మేము వ్యతిరేకం. కేంద్ర హోం శాఖ మంత్రిగా మీరే ఉన్నారు.. ఎందుకు చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించే విధంగా అవకాశం కలిగింది.. దానిపై ఆత్మ విమర్శ చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ తొలగించిన ఓట్లపై ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఓట్ల తొలగించడం పై మాత్రమే ప్రశ్నిస్తుంది . గతంలో బీఆర్ఎస్ ఉన్నప్పుడు కూడా మీరు ఏటీఎం అన్నారు .. మళ్ళీ కాంగ్రెస్ పార్టీ పై మాట్లాడుతున్నారు. దేశంలో మోడీ అమిత్ షా టాక్స్ నడుస్తుంది.. ముగ్గురు గుజరాత్ ల కోసం మాత్రమే దేశ ప్రధానమంత్రిగా హోం మంత్రిగా పనిచేస్తున్నారు . మీ హామీల గురించి ఒక్కొకటిగా బహిరంగ చర్చకు మీ రాష్ట్ర నాయకత్వం సిద్ధమా...? కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలు ఏ గడపకు వెళ్లినా సన్న బియ్యం ,రేషన్ కార్డులు,200 యూనిట్ల ఉచిత విద్యుత్,ఉచిత బస్ ,ఉద్యోగ నియామకాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం మాది. మా దగ్గర నుండి కేంద్రానికి వెళ్తున్న టాక్స్ ఎంత.. తెలంగాణ కి మీరు తిరిగి ఇస్తున్నది ఎంత...? తెలంగాణ ప్రజలందరికీ తెలుసు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రధాని నిరంకుశ వైఖరి కి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పోరాడుతున్నామో మీరు కూడా తప్పకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ర్యాలీ తీయడాన్ని తప్పకుండా మంచిదే. మీరు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు మేము ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతున్నాం..అరాచకత్వం నశించాలని కోరుతున్నాం. ప్రతిపక్షంలో ఉన్నవారు అరాచకత్వాన్ని ప్రజాస్వామ్యాన్ని కూని చేసే అవకాశం లేదు . 12 ఏళ్లుగా పరిపాలిస్తున్న మీరే ఈ పరిస్థితికి కారకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి . మీ హైదరాబాద్ పర్యటన ఎంత ఫెలవంగా ఉందో మీకు తెలుసు . అది మీ స్థానిక నాయకత్వం రాసిన స్క్రిప్ట్ . ఇప్పటికైనా తెలంగాణ లో ఎల్ నినో ప్రభావం తో ఉన్న కరువుపై కేంద్రం నుండి సహాయం చేయాలి. ఢిల్లీలో జరిగిన ర్యాలీ నీ కౌంటర్ చేయడానికి ఢిల్లీలో ధైర్యం లేక కేవలం హైదరాబాద్ వచ్చారు.. మీ పర్యటన సందర్భంగా మరోసారి అడుగుతున్న. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి మీరు చేసిన ర్యాలీ అన్ని రాష్ట్రాల్లో చేయండి... ప్రజాస్వామ్యం రావాలి.. ప్రజాస్వామ్యం కాపాడబడాలి అర్హులైన ఓట్లు ఉండాలి. విదేశీయుల ఓట్లు తీసేశాం అంటున్నారు. కాదా...వారిని వారి దేశాలకు తిప్పి పంపించారా? ఎంత మందిని పంపించారు? మీ సర్ ప్రక్రియలో ఎంతమంది విదేశీయుల ఓట్లు తొలగించారో ఆదారాలు చెబుతారా? సర్ పై చర్చకు పెడుతాం రా..పార్లమెంటు సమావేశాలు పెట్టి...చర్చ చేపట్టు. తెలుకుట్టిన దొంగల్లా మీరు ఓట్లు చోరి చేస్తూ దొరికిపోయారు..ఇప్పుడు పాదయాత్ర పేరుతో బుకాయిస్తారా? మా 6 గ్యారెంటీలు చెబుతాం..మీరు రైతులకు నెలవారి పించన్లు ఇస్తామన్నారు ఇచ్చారా? ఉచిత విద్యుత్ ఇస్తమాన్నారు..ఇచ్చారా? ఇంటికి 15 లక్షలు ఇస్తామన్నారు..ఇచ్చారా? 30 శాతం ధరలు తగ్గిస్తామన్నారు..చేస్తారా? లీటర్ పెట్రోల్ 50 రూపాయలకు ఇస్తామన్నారు..ఇస్తున్నారా ని ప్రశ్నించారు.

ఏసీబీ వలలో మెప్మా ఏడీ.. ఇంట్లో కిలోల కొద్దీ బంగారం, ఆస్తిపత్రాలు గుర్తింపు

మెప్మా అదనపు డైరెక్టర్ యాదగిరి రావుపై ఏసీబీ కేసు నమోదు

సోదాల్లో రూ. 4.75 కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తింపు

ఉప్పల్‌లో GG3 భవనంతో పాటు పలుచోట్ల స్థలాలు, ఫ్లాట్లు

కిలోల కొద్దీ బంగారం, వెండి, ఖరీదైన కార్లు స్వాధీనం

హైదరాబాద్ సహా 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు





పురపాలక ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరి రావు అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో ఆయనపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, జరిపిన సోదాల్లో సుమారు రూ. 4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. మంగళవారం హైదరాబాద్‌తో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. యాదగిరి రావు నివాసం, కార్యాలయం, బంధువులు, బినామీలకు సంబంధించిన ఇళ్లలో ఈ సోదాలు జరిగాయి.

ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఉప్పల్ హైకోర్టు కాలనీలో 334 గజాల స్థలంలో నిర్మించిన +o3 భవనం విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని అంచనా. దీంతో పాటు ఉప్పల్‌లోనే రెండు ఫ్లాట్లు, ఒక వాణిజ్య దుకాణం, హబ్సిగూడ, పెద్ద అంబర్‌పేట్, మేడిపల్లి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో మొత్తం 12 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు పత్రాలను గుర్తించారు.

సోదాల్లో సుమారు 1.8 కిలోల బంగారం (1,792 గ్రాములు), 3 కిలోల వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ. 73 లక్షల విలువైన టయోటా ఫార్చూనర్, మరో కారు, మూడు ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 32.30 లక్షల నగదు నిల్వలు, రూ. 29 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ. 7 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఉన్నట్లు తేలింది.

ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ. 4.75 కోట్లుగా లెక్కగట్టామని, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ ఇంకా చాలా ఎక్కువగా ఉంటుందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. యాదగిరి రావు కుమారుడికి సంబంధం ఉన్నట్లు భావిస్తున్న రబ్బర్ ఫ్యాక్టరీ, ట్రాన్స్‌మిషన్ పరిశ్రమల్లోని పెట్టుబడులపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన అధికారులు, యాదగిరి రావును ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కేసులో విచారణ కొనసాగుతోంది.

నవంబర్ 26, 27 సివిల్ ఇంజినీరింగ్ పరిష్కారాలపై ప్రత్యేక సదస్సు





హైద్రాబాద్ నవంబర్3; సుస్థిరమైన, వినూత్నమైన సివిల్ ఇంజినీరింగ్ పరిష్కారాలపై నవంబర్ 26, 27 తేదీల్లో ప్రత్యేక సదస్సు జరుగనుంది.

సివిల్ ఇంజినీరింగ్ రంగంలో స్థిరమైన అభివృద్ధి, వినూత్న ఆవిష్కరణలు, విపత్తులను తట్టుకునే నిర్మాణాల రూపకల్పన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించేందుకు అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ (ఇండియా) హైదరాబాద్ సెంటర్ ఆధ్వర్యంలో RIDES-2026 సదస్సును నిర్వహించనున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ESCI)లో రెండు రోజుల పాటు ఈ సదస్సుతో పాటు బిల్డ్-టెక్ ఎక్స్‌పో 2026 జరగనుంది.

ఈ కార్యక్రమానికి దేశ, విదేశాలకు చెందిన 1,000 మందికి పైగా సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు, స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లు, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకానున్నారు. నిర్మాణ రంగం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఎదురవుతున్న సవాళ్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వారు చర్చించనున్నారు.

ఈ సదస్సులో పలువురు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ప్రసంగించనున్నారు. నలంద విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సునైనా సింగ్ ముఖ్యోపన్యాసం చేయనున్నారు. క్రీ.పూ. 415 నాటి చారిత్రక నలంద నిర్మాణాల పునరుద్ధరణ, పునరావాసం, పునర్నిర్మాణ అంశాలపై ఆమెప్రసంగించనున్నారు.ప్రొఫెసర్ డాక్టర్-ఇంగ్ మార్వాన్ అల్‌జయ్యాలే ఆధునిక డీప్ ఫౌండేషన్ ఇంజినీరింగ్‌పై వివరించనున్నారు. డాక్టర్ వి. రాజేంద్రన్, CSIR-SERC చెన్నై డైరెక్టర్ డాక్టర్ ఎన్. ఆనందవల్లి, డాక్టర్ మొహమ్మద్ అబ్బాల్ స్ట్రక్చరల్ రిహాబిలిటేషన్, స్ట్రక్చరల్ హెల్త్ మానిటరింగ్, లాంగ్ స్పాన్ నిర్మాణాలపై తమ అనుభవాలను పంచుకోనున్నారు.

డిజిటల్ ఇంజినీరింగ్, BIM ఆధారిత డిజైన్, 3ణ కాంక్రీట్ ప్రింటింగ్ వంటి ఆధునిక అంశాలపై రాయ్ అనిరుద్ధ, వాయు కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఎర్. వి. ఉమామహేశ్వరన్ ప్రసంగించనున్నారు.

అలాగే హై-రైజ్ భవనాల్లో ప్లంబింగ్ వ్యవస్థలు, గ్రీన్ రూఫ్స్, వర్టికల్ ట్రాన్స్‌పోర్టేషన్, కాంపోజిట్ స్ట్రక్చర్స్ వంటి అంశాలపై ఎర్. వీరేష్ ఎస్.సి., డాక్టర్ అంకిత్ గార్గ్, ఎర్. వి. జగదీష్ కుమార్, ఎర్. గురురాజ్ ఎస్. థాలి తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు.

వాతావరణ మార్పులు, తీవ్ర ప్రకృతి వైపరీత్యాలు, వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, పాతబడుతున్న మౌలిక సదుపాయాల నేపథ్యంలో భవిష్యత్తు నిర్మాణ రంగానికి అవసరమైన సురక్షితమైన, సుస్థిరమైన, వినూత్న ఇంజినీరింగ్ పరిష్కారాలను ప్రోత్సహించడమే RIDES-2026 ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

ఈ సదస్సు ద్వారా పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి మరింత బలోపేతం కానుంది.

సదస్సుతో పాటు నిర్వహించే బిల్డ్-టెక్ ఎక్స్‌పో 2026లో ఆధునిక నిర్మాణ సామగ్రి, అత్యాధునిక యంత్రాలు, ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్, పర్యావరణహిత నిర్మాణ పరిష్కారాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించనున్నారు. ఉత్పత్తుల ప్రత్యక్ష ప్రదర్శనలు, వ్యాపార అవకాశాలు, నెట్‌వర్కింగ్‌కు ఈ ఎక్స్‌పో వేదికగా నిలవనుంది.

కేటీఆర్ ఇలాకాలో 'అభివృద్ధి' నాటకం - కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరేనా

ప్రచారానికి కోట్లు.. నిర్వహణకు పైసలు లేవు.
నిరుపయోగంగా లూ కేఫ్‌లు, తుప్పు పడుతున్న జిమ్‌లు,
వెలవెలబోతున్న మార్కెట్లు.







రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 3, (ప్రజాబలం ప్రతినిధి)సిరిసిల్ల అంటే అభివృద్ధికి చిరునామా అని, రాష్ట్రానికే రోల్ మోడల్ అని వేదికలెక్కి ఊదరగొట్టిన మాటలకు.క్షేత్రస్థాయిలోని చేదు నిజాలకు అసలు పొంతనే లేకుండా పోయింది. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి కట్టిన నిర్మాణాలు నేడు పిచ్చిమొక్కలకు,బూజులకు నిలయాలుగా మారాయి. పాలకుల ఆర్భాటం, అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రజల పన్నుల సొమ్ము నిలువునా బూడిదలో పోసిన పన్నీరవుతోంది.

మూతపడ్డ లూ కేఫ్‌లు.. పోస్టర్ల గోడలుగా మారిన వైనం

సిరిసిల్ల పట్టణంలో వివిధ చోట్ల చంద్రంపేట చౌరస్తా,కొత్త చెరువు.ప్రభుత్వ ఆసుపత్రి,బతుకమ్మ ఘాటు,కొత్త బస్టాండ్ దగ్గర ప్రజలు, మహిళల సౌకర్యార్థం అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన లూ కేఫ్ కేంద్రాలు నేడు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. ప్రారంభంలో విపరీతమైన ప్రచారం చేసుకుని, ఆ తర్వాత నిర్వహణను గాలికొదిలేయడంతో తలుపులు మూసుకుపోయాయి. లూ కేఫ్ బయటి గోడలు వివిధ రకాల ప్రకటనల పోస్టర్లకు, చెత్తకు అడ్డాలుగా మారడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. చంద్రంపేట చౌరస్తా వద్ద వాడక ముందే తుప్పు పట్టి ఆనవాలు లేకుండా పోయాయి,కోట్ల రూపాయల నిధులతో వీటిని నిర్మించింది ప్రజల సౌకర్యం కోసమా లేక కాంట్రాక్టర్ల జేబులు నింపడానికా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రైతు బజార్లు, మార్కెట్లు వెలవెల.. వ్యాపారం శూన్యం

చిరువ్యాపారులు, రైతులు, చేపల విక్రయదారుల కోసం లక్షల రూపాయలు గుమ్మరించి నిర్మించిన మార్కెట్ షెడ్లు ఏళ్ల తరబడి ఖాళీగా పడి ఉంటున్నాయి. గోడలపై వేసిన చేపలు, బొమ్మల రంగులు తప్ప అక్కడ ఒక్క వ్యాపారి గానీ, కొనుగోలుదారుడు గానీ కనిపించని దుస్థితి నెలకొంది. సరైన ప్రణాళిక లేకుండా, ప్రజలకు అందుబాటులో లేని ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారనడానికి ఈ ఖాళీ మార్కెట్ సముదాయాలే నిదర్శనం.

తుప్పు పడుతున్న ఓపెన్ జిమ్‌లు.మట్టిలో కూరుకుపోయిన పరికరాలు,

పట్టణ ప్రజలకు,యువతకు ఆరోగ్యాన్ని అందించే లక్ష్యంతో పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు అనాథలా దర్శనమిస్తున్నాయి. లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన వ్యాయామ యంత్రాలు నిర్వహణ లేక తుప్పు పట్టిపోగా, వాటి కింద ఇసుక, మట్టి దిబ్బలు పేరుకుపోయి పనికిరాకుండా పోయాయి. చిన్నారులు, యువకులు వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేకపోగా, ప్రమాదాలకు నిలయంగా మారాయి.

ఇది పాలకుల పాపమా? అధికారుల వైఫల్యమా?

కేవలం శిలాఫలకాలపై పేర్లు వేయించుకోవడానికి, కెమెరాల ముందు ఫోటోలకు పోజులివ్వడానికే ఈ అభివృద్ధి పరిమితమైందా అని ప్రజలు మండిపడుతున్నారు. నిధులు మంజూరు చేసి వదిలేయడం తప్ప, అవి ప్రజలకు ఉపయోగపడుతున్నాయా లేదా అని సమీక్షించే తీరిక స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు లేకుండా పోయింది. ప్రజల చెమట చుక్కలతో కట్టిన పన్నుల సొమ్ముతో ఈ రకమైన ప్రహసనాలు ఇంకెన్నాళ్లు సాగుతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి, నిరుపయోగంగా పడి ఉన్న లూ కేఫ్‌లు, మార్కెట్లను అందుబాటులోకి తేవాలని,పాడైపోయిన ఓపెన్ జిమ్‌లను బాగుచేయాలని సిరిసిల్ల పట్టణం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న MLC స్థానాన్ని ఆర్యవైశ్య మహిళలకు కేటాయించాలని ముఖ్యమంత్రి గారికి AVOPA మణికొండ మహిళా విభాగం విజ్ఞప్తి.



తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతము ఖాళీ అవుతున్నటువంటి గవర్నర్ కోటాలో ఉన్నటువంటి ఎమ్మెల్సీ స్థానంలో ఆర్యవైశ్య మహిళలకు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ ముఖ్యమంత్రి గారికి మణికొండ AVOPA ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శి కోశాధికారి స్నేహ మహాలక్ష్మి దేవి ప్రియ విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగి మూడు పర్యాయాలు మీూ ఎలక్షన్స్ వీూ ఎలక్షన్స్ జరిగాయి మరియు మధ్యలో కొన్ని మీజ స్థానాలకు కూడా ఎలక్షన్స్ జరిగాయి, కాంగ్రెస్ పార్టీకి అవకాశం వచ్చి సుమారుగా 400 మంది ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ బి ఫారం టికెట్లు ఇచ్చింది , అందులో ఒక్కరి అంటే ఒక్కరి కూడా ఆర్యవైశ్యులకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదు.

తెలంగాణ రాష్ట్రంలో 6 నుంచి 8 శాతం ఉన్న ఆర్యవైశ్యులలో కాంగ్రెస్ పార్టీ ఒక్క నాయకత్వాన్ని కూడా గుర్తించలేదు, ఎమ్మెల్యే ఎంపీ పదవులకు అవకాశం వచ్చినప్పుడు ఒక్కసారి కూడా ఒక్క అంటే ఒక్క ఆర్యవైశ్యునికి మీరు టికెట్ ఇవ్వలేదు, కనీసం ఇప్పుడైనా మీ చేతుల అవకాశం ఉంది, కనీసం ఇప్పుడైనా మా ఆర్యవైశ్య లోకానికి ముఖ్యంగా ఆర్యవైశ్య మహిళలకు గవర్నర్ కూటలో ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని మేము బలంగా మీ మీద ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నాము.

గతంలో ఆర్యవైశ్య పితామహుడు రోశయ్య గారిని ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి అత్యున్నత పదవులను అధిరోహించిన ఆయన ప్రస్థానం ఆర్యవైశ్యులకు స్ఫూర్తిదాయకం. కాంగ్రెస్ పార్టీ అందించిన ప్రోత్సాహం, అవకాశాలు ఆయన ఎదుగుదలకు దోహదపడ్డాయి. మా ఆర్యవైశ్య మద్దతు కూడా మీ పార్టీకి అందించారు.

ఈ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా, ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాన్ని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి కేటాయించాలని మేము కోరుతున్నాము.

ఆర్యవైశ్యుల సమస్యలను చట్టసభల్లో వినిపించడానికి మాకు ఒక్క నాయకత్వం కూడా లేదు ఇది చాలా సిగ్గుచేటు మా లోకానికి.

కావున, గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు మీరు మా విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి, గవర్నర్ కోటాలో ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లవలసిందిగా హృదయపూర్వకంగా కోరుతున్నాము.

ఆర్యవైశ్యుల ఆకాంక్షలకు తగిన గుర్తింపు లభించేలా మీరు సహకరిస్తారని ఆశిస్తున్నాము.

అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

రోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు రుద్రంగి మండలం మానాల అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎత్తు బరువును పరిశీలిస్తుండగా తనిఖీ చేశారు. సామ్, మామ్ పిల్లలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో ఆరో వాటర్ యంత్రం పనితీరు, ఫ్యాన్లు, లైట్లు పరిశీలించారు. అలాగే ప్రాథమిక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుండగా, తనిఖీ చేశారు. తరగతి గదులు సైతం పరిశీలించారు.ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో వారి బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 10 వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, ఆరోగ్య కార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. నీటిని వేడి చేసి.. చల్లార్చి తాగించాలని తెలిపారు. టాయిలెట్ వెళ్లిన తరువాత పిల్లలు చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బాలామృతంతో పిల్లలకు ఇష్టమైన కేకులు, లడ్డూలు, బిస్కెట్లు ఇతర ఆహార పదార్థాలు తయారు చేసి ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ కీలకమని, వారికి సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి.. మహిళలు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలని, మందులు అందించాలని ఆదేశించారు. గర్భిణులు నార్మల్ డెలివరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలాల్లాయిడ్, తహసీల్దార్ పుష్పలత, సర్పంచ్ శంకర్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ పాతబస్తీలో దారుణ హత్య..

కాపాడేందుకు వెళ్లిన వ్యక్తిపై కూడా దాడి

హైదరాబాద్ పాతబస్తీ కాంచన బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్ బాబా నగర్‌లో తెల్లవారుజామున దారుణ హత్య జరిగింది . సయ్యద్ ఒమర్ అలియాస్ మషల్లా ఒమర్ అనే యువకుడిపై దుండగులు కత్తితో దాడి చేసి హత్య చేశారు. సంఘటన స్థలంలోనే ఒమర్ ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం తో ఆధారాలు సేకరిస్తున్నారు.

ఒమర్‌ను కాపాడేందుకు ప్రయత్నించిన సయ్యద్ అనే వ్యక్తిపై కూడా దుండగులు దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఈ హత్యను అమన్ ఖురేషి, అలీ భైసా అనే వ్యక్తులు చేసారని ఘటనాస్థలంలో ఉన్న కొందరు స్థానికులు తెలిపారు.

మృతుడు ఒమర్ నేర చరిత్ర కలిగిన వ్యక్తి మద్యం, గంజాయి మత్తులో ఓ గ్యాంగ్ ని ఏర్పాటు చేసుకొని స్థానికులను బెదిరించడం, దాడులు చేయడం, డబ్బులు వసూలు చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలపై పోలీసుల సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

వ్యవసాయానికి సోలార్ పంపుసెట్లు..

అధికారులకు రెడ్‌కో సీఎండీ కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్3: రాష్ట్రంలో సాగుకు సోలార్ పంపుసెట్లను అందించనున్నట్టు రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన సోలార్ పంపుసెట్ల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టీజీ రెడ్‌కో వీసీ, ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆ సంస్థ అధికారులు, జిల్లా మేనేజర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన పథకాల అమలును వేగవంతం చేసి గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. మాడల్ సోలార్ విలేజ్, రూఫ్‌టాప్ సోలార్, పీఎం కుసుమ్ పథకం, వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్, ఎలక్ట్రికల్ వాహన చార్జింగ్ స్టేషన్లపై ఆయన ఆరా తీశారు. గృహజ్యోతి ఇండ్లపై సోలార్ ప్లాంట్లురూఫ్‌టాప్ సోలార్ పథకంలో భాగంగా గృహజ్యోతి పథకం కింద నిర్మించిన ఇండ్లపై విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ఆసక్తి చూపిన వారి ఇండ్లపై ప్లాంట్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పీఎం కుసుమ్ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో రెడ్‌కో జీఎం సీఎస్‌వీ ప్రసాద్, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

వరుస తుఫాన్లు... ఏం జరుగుతోంది

విజయవాడ నవంబర్ 3, వారం రోజుల వ్యవధిలో ఏర్పడిన రెండు తుఫాన్లు ఏపీలో వర్షాభావాన్ని పూర్తిగా తగ్గించేశాయనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులపై ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు తుఫాన్లు చాలా మేలు చేశాయని విశ్లేషిస్తున్నారు. తుఫాన్ కారణంగా చాలా నష్టం జరిగినప్పటికీ, భారీ వర్షాల కారణంగా వేసవి సవాళ్లను అధిగమించేలా అవకాశం లభించిందని అంటున్నారు. ప్రస్తుతం చేతికందిన పంట కొంతవరకు దెబ్బతిన్నప్పటికీ, రెండో పంటకు పుష్కలంగా నీరు లభించిందని చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇటు రైతుకు అటు ప్రభుత్వానికి నష్టం జరిగినా, ఎల్ నినో ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా బయటపడటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించినట్లేనని అంటున్నారు. ఎల్ నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంది. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో రాష్ట్రంలో దాదాపు 450 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. పంట దిగుబడులు తగ్గిపోతాయనే ఆందోళన ఎక్కువ కావడంతో మార్కెట్లో అనేక రకాల సరకులకు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో ఎన్నడూ లేనట్లు నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబును రాజకీయంగా ఇరుకన పెట్టేందుకు ప్రత్యర్థులు ఈ వాతావరణ పరిస్థితులను కూడా వాడుకుంటున్నారు. రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నేతలతోపాటు తెలంగాణకు చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు సైతం చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వర్షాలు కురవవు అనే సెంటిమెంటు ద్వారా రాజకీయం చేయాలని చూశారని అంటున్నారు. అయితే అనూహ్యంగా గత వారం రోజుల్లో రెండు తుఫాన్లు ఏర్పడటంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితుల నుంచి బయటపడిందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత నెల 28న కోనసీమ తీరాన్ని తాకిన అర్నబ్ తుఫాన్ వల్ల శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలే కురిశాయి. ఈ వర్షాల కారణంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాదాపు 20 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ వర్షాల వల్ల జరిగిన నష్టానికి సమానంగా మేలు కూడా జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదపు కోస్తా ప్రాంతంలో పుష్కలంగా నీరు చేరిందని, అన్ని చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయని చెబుతున్నారు. వాగులు, వంకలు, గెడ్డలు పొంగిపొర్లడంతో రానున్న వేసవికి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం లేదని విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి ఎల్ నినో కారణంగా 2027 జూన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని అంటున్నారు. దీనివల్ల తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. పొరుగున ఉన్న తెలంగాణలో ఇప్పటికే ఈ సమస్య మొదలైందన్న వార్తలు వస్తున్నాయి. అయితే ఏపీకి మాత్రం రెండు తుఫాన్లు తాగునీటి ముప్పు లేకుండా చేశాయని, అదే సమయంలో రబీ పంటలకు సాగునీటి చింత లేకుండా పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. అర్నాబ్ కారణంగా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలు కురిస్తే, ఇప్పుడు మురసు తుఫాన్ వల్ల ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం, పల్నాడు జిల్లాలతోపాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక ఈ సీజన్ లో చుక్క నీరు కూడా చేరని పులిచింతల, నాగార్జున సాగర్ కు భారీగా వరద వచ్చే అవకాశం ఉందన్న అంచనాలు ఆ ప్రాజెక్టుల కింద ఉన్న రైతుల్లో ఆశలు రేపుతున్నాయని చెబుతున్నారు. మొత్తానికి ఈ పరిస్థితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరటనిస్తున్నట్లుగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన చంద్రబాబు హయాంలో వర్షాభావ పరిస్థితులు ఎదురవడం అత్యంత సహజమే అయినప్పటికీ ఆయన రాజకీయ ప్రత్యర్థులు ప్రకృతి శాపంగా విమర్శలు చేయడం ద్వారా సీఎంను మానసికంగా ఇబ్బంది పెట్టేవారని అంటున్నారు. అయితే ఈ సారి ప్రకృతి ఇలాంటి విమర్శలకు అవకాశం ఇవ్వకుండా తాను చంద్రబాబు పక్షాన ఉన్నట్లు నిరూపిస్తోందని అంటున్నారు. గత ఆగస్టులో కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలకు కృష్ణా, గోదావరి నదులకు ఒకేసారి వరదలు వచ్చాయి. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు లిప్ట్ ద్వారా రాయలసీమకు నీటిని తరలించి ఆ ప్రాంతంలో పంటలను కాపాడగలిగారని అంటున్నారు. ఇదే సమయంలో పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసి కృష్ణా డెల్టాకు కరువు ఛాయలు లేకుండా జాగ్రత్త పడ్డారు.

ఇప్పుడు మిగిలిన ప్రాంతంలోనూ తుఫాను కారణంగా వర్షాలు కురిసి నీటి కొరత లేకుండా పోయిందని విశ్లేషిస్తున్నారు. ఇదంతా గమనిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిస్థితులు అనుకూలిస్తున్నట్లుగా భావించాల్సివస్తోందని అంటున్నారు.



అనకాపల్లి జిల్లాలో అగ్నిప్రమాదం

అర్ధరాత్రి ఐషర్ వ్యాన్ దగ్ధం.

అనకాపల్లి ఎన్.రాయవరం మండలం, పెనుగొల్లు సమీపంలో జాతీయరహదారిపై ఐషర్ వ్యాన్ దగ్ధం అయింది. అప్రమత్తం అయిన డ్రైవర్, వాహనాన్ని పక్కకు ఆపివేసాడు. వ్యాన్ లో నుండి దిగిపోయాడు. వాహనం రాత్రి విశాఖ వైపు నుండి తుని వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సడన్ గా ఇంజిన్ లోనుండి షార్ట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయి.

తీరం దాటిన మురసు తుపాను..

తెల్లవారుజామున 3:30కు సీఎం చంద్రబాబు సమీక్ష

కొత్తపట్నం వద్ద తీరం దాటిన మురసు తుఫాన్

తెల్లవారుజామున కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశం

ప్రభావిత జిల్లాల్లో భారీ వర్షాలు, పలుచోట్ల కూలిన చెట్లు

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని తెలిపిన అధికారులు

అమరావతి మురసు తుపాను తీరం దాటిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి అధికారులను అప్రమత్తం చేశారు. తెల్లవారుజామున 3:30 గంటలకు జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. తుఫాన్ రాత్రి ఒంటి గంటకు ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం వద్ద తీరాన్ని తాకిందని, ఉదయం 6:30 గంటల కల్లా పూర్తిగా తీరం దాటుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆస్తి నష్టాన్ని కూడా వీలైనంత వరకు నివారించాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపైకి రాకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, సబ్‌స్టేషన్ల పరిస్థితిపై ఆరా తీయగా, ప్రస్తుతం ఎక్కడా స్తంభాలు పడిపోలేదని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగలేదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.సమీక్షలో భాగంగా పలు జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయి వివరాలను సీఎంకు అందించారు. బాపట్ల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, రేపల్లె, చీరాల, వేటపాలెం ప్రాంతాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉందని కలెక్టర్ తెలిపారు. రెండుచోట్ల చెట్లు కూలగా, వాటిని వెంటనే తొలగించామన్నారు. నెల్లూరులో 7 చోట్ల, ఒంగోలు జిల్లాలో 5 ప్రాంతాల్లో చెట్లు కూలిపోగా, సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టి తొలగించారని సంబంధిత కలెక్టర్లు వివరించారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, నాగాయలంకలో వర్షం ఎక్కువగా ఉందని, గుంటూరు జిల్లాలో వర్షపాతం నమోదైనా ఎలాంటి నష్టం జరగలేదని కలెక్టర్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో చిరు జల్లులు పడుతున్నాయని, మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో ముందుజాగ్రత్తగా కొన్ని కుటుంబాలను శిబిరాలకు తరలించామని కలెక్టర్ లక్ష్మీషా చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నుంచి ఆర్టీజీఎస్‌లోనే ఉండి తుపాను పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. రాత్రి 10 గంటలకు ఒకసారి, తెల్లవారుజామున మరోసారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించడమే కాకుండా, ప్రతి గంటకు అధికారుల నుంచి సమాచారం తీసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. తుపాను సహాయక చర్యలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌కు కూడా ఏర్పాట్లు చేశామని కలెక్టర్లు సీఎంకు తెలియజేశారు.



టీటీడీకి కొత్త కమిటీ..

ముగ్గురు ఉన్నతాధికారులతో 'స్పెసిఫైడ్ అథారిటీ' ఏర్పాటు

తిరుమల, నవంబర్ 3, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పదవీ కాలం ఇటీవల ముగియడంతో టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేయడం జరిగింది.

టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉంటారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి రెండేళ్ల పదవీ కాలం ఇటీవల ముగిసింది. తిరుమల చరిత్రలో ఇలాంటి స్పెసిఫైడ్ అథారిటీలు ఏర్పాటు కావడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలోనూ పాలకమండలి పదవీకాలం ముగిసి కొత్త బోర్డు ఏర్పాటులో న్యాయపరమైన, సాంకేతిక అడ్డంకులు ఎదురైన సందర్భాల్లో ప్రభుత్వాలు అధికారులతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను నడిపిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఈసారి ఎన్నికల నియమావళి అడ్డంకిగా మారడం, రాజకీయ నియామకాలకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించని కారణంగా .. ప్రభుత్వానికి స్పెసిఫైడ్ అథారిటీని తెరపైకి తేవడం అనివార్యమైంది. అనుభవజ్ఞులైన ఉన్నతాధికారులకే పాలనా పగ్గాలు అప్పగించడం ద్వారా రాజకీయ వివాదాలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా వ్యవస్థను నడిపించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం, కోడ్ ముగిసిన తర్వాతే పూర్తిస్థాయి టీటీడీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉంది. అప్పటివరకు తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించడం, రాబోయే రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయడం, నిధుల వినియోగంలో పారదర్శకతను కాపాడటం ఈ స్పెసిఫైడ్ అథారిటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి. సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో టీటీడీ సమర్థవంతంగా పనిచేస్తూ భక్తుల విశ్వాసానికి తగినట్లుగా నిర్ణయాలు తీసుకుంటుందని దేవదాయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేసింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉండనున్నారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.ఆయనతో పాటు అనుభవజ్ఞులైన మరో ఇద్దరి అధికారులు ఈ కమిటీలో ఉంటారు. ఈ ముగ్గురి టీమ్ శ్రీవారి ఆలయ నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, బోర్డు వ్యవహారాలను పర్యవేక్షించడం జరుగుతుంది. కొత్త టీటీడీ ట్రస్ట్ బోర్డును పునర్వ్యవస్థీకరించే వరకు లేదా ఏడాది కాల పరిమితి పూర్తయ్యే వరకు ఈ స్పెసిఫైడ్ అథారిటీ అమల్లో ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. అలాగే సాధారణ టీటీడీ పాలకమండలికి ఉండే చట్టబద్ధమైన అన్ని అధికారాలు, విధివిధానాలు, నిర్ణయాధికారాలు ఈ కమిటీకి వర్తిస్తాయి. దీనివల్ల కొత్త బోర్డు ఏర్పాటులో జాప్యం జరిగినప్పటికీ భక్తుల సేవలు, శ్రీవారి నిత్యోత్సవాలు, పరిపాలనాపరమైన నిర్ణయాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉంటుంది.అయితే టీటీడీకి ఇలా స్పెసిఫైడ్ అథారిటీ రావడం ఇదే తొలిసారి కాదు.. గతంలో అంటే 2010, 2021లో ఇలాంటి కమిటీలు ఏర్పాటయ్యాయి. 2010లో ఐఏఎస్ జె.సత్యనారాయణ సమక్షంలో, 2021లో అప్పటి ఈవో జవహర్ రెడ్డి చైర్మన్‌గా ప్రభుత్వాలు స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేశారు. బోర్డు లేని సమయంలో పాలన, పనులు, కార్యకలాపాల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకే అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వంలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో కొత్త బోర్డు కూర్పునకు సమయం పట్టే ఛాన్స్ ఉంది. అందుకే పాలన సాఫీగా సాగేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేసింది.

మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ కు సర్వం సిద్ధం

అనంతపురం సాయిబాబా కాలేజీలో మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమయింది. 62 డివిజన్లకు.. 62 టేబుళ్లు ఏర్పాటు చేసారు. మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం 24 టేబుళ్లు ఏర్పాటు చేసారు. 25 ఓట్లు చొప్పున కట్టలు కట్టి... లెక్కించనున్నారు. జిల్లాలో తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం మునిసిపాలిటీలకు కౌంటింగ్ ఏర్పాట్లు జరిగాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుకొండ, మడకశిర, హిందూపురం పుట్టపర్తి ధర్మవరం, కదిరి మునిసిపాలిటీ లకు కౌంటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పోలీసులు కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసారు.

అసైన్డ్, ఇనాం, చుక్కల భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తులపై కీలక జీవో

విజయవాడ, నవంబర్ 3, అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములపై వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల విషయంలో ఏపీ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసింది. ఇలాంటి భూములకు సంబంధించిన ఫ్ రీహోల్డ్ దరఖాస్తులు వెంట వెంటనే పరిష్కరించే విధంగా కాలపరిమితిని విధించింది. దీని ప్రకారం ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలి. అదేవిధంగా తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 659 జారీ చేయడం జరిగింది.రాష్ట్రంలోని అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఈ భూముల ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా.. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన డెడ్‌లైన్లు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 659ను అధికారికంగా రిలీజ్ చేసింది.ఈ కొత్త జీవో ప్రకారం ఆర్డీవో పరిధిలోకి వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను ఎక్కువలో ఎక్కువగా రెండు నెలల్లోపు అంటే 60 రోజుల్లోపు కచ్చితంగా పరిష్కరించాల్సి ఉంటుంది. అదేవిధంగా కొన్ని నిర్దిష్ట కేటగిరీలకు చెందిన అప్లికేషన్లను కేవలం నెల రోజుల్లోనే క్లియర్ చేయాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన గడువును నిర్దేశించింది. ఇక తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులకు సైతం 60 రోజుల సమయాన్ని గరిష్ట పరిమితిగా నిర్ణయించింది.ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం రెవెన్యూ శాఖ పోర్టల్లో పలు సాంకేతిక మార్పులను సైతం చేసింది. రైతులు లేదా యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే, ఆ అప్లికేషన్ నేరుగా సంబంధిత తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. దీనివల్ల ఫైళ్ల కదలికలో జరిగే జాప్యానికి పూర్తిగా చెక్ పడినట్టవుతుంది.అలాగే రిజిస్ట్రేషన్ల విషయంలోనూ ప్రభుత్వం రైతులకు లైన్ క్లియర్ చేసింది. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్‌గా నమోదైన వెంటనే, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని పేర్కొంది. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రత్యేకంగా అధికారుల నుంచి ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్‌ని అందించాల్సిన అవసరం ఇకపై ఉండదని వెల్లడించింది. వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేట్ అయిన వివరాలను రికార్డుల్లో పకడ్బందీగా భద్రపరచాలని, ఈ సరికొత్త గైడ్‌లైన్స్‌ను రెవెన్యూ యంత్రాంగం తప్పకుండా పాటించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కొత్త మార్గదర్శకాల వల్ల భూ వివాదాలకు తెర పడే అవకాశం ఉంది. అలాగే రెవెన్యూ సేవలు మరింత వేగవంతం కానున్నాయి.

విజయసాయిరెడ్డి పార్టీలోకి టీడీపీ నేత

నెల్లూరు, నవంబర్ 3, సీనియర్ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆయన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.. పార్టీ ఒంటెద్దు పోకడలు నచ్చక పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఆయన విజయసాయిరెడ్డి కి అండగా నిలుస్తానని.. ఆయన ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. విజయసాయిరెడ్డి నవంబర్ 11న పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి దసరా పండుగ సమయంలో పార్టీ ఏర్పాటు చేయాలని భావించారు..కానీ స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా ఇతర కారణాల దృష్ట్యా నిర్ణయం మార్చుకున్నారు. ఈ నెలలోనే ఆయన కొత్త పార్టీ ప్రారంభించనున్నారు.విజయసాయిరెడ్డి గత నెలలో తిరుపతిలో తన పార్టీ గురించి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడారు. అనంతరం మరుసటి రోజు శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వేంకటేశ్వర స్వామిని విజయసాయి దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన ఆయన.. కొత్త పార్టీ విర్భావం, తనతో కలిసి పనిచేయబోయే వారి గురించి చెప్పుకొచ్చారు. కొత్త పార్టీకి స్వామి వారి ఆశీస్సులు పొందినట్లు తెలిపారు. అలాగే తన సహచుడు ఓవీ రమణను కొత్త పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. తాము గతంలో నాలుగేళ్ల పాటు టీటీడీ బోర్డు సభ్యులుగా కలిసి పని చేశామని విజయసాయిరెడ్డి గుర్తు చేసుకున్నారు. నూతన పార్టీలో ఇద్దరం కలిసి విజయం సాధిస్తామన్నారు. విజయసాయిరెడ్డి ఆహ్వానం మేరకు కొత్త పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు.తిరుపతికి చెందిన ఓవీ రమణ టీడీపీలో కీలక నేతగా ఎదిగారు. అయితే 2019లో ఆయన బీజేపీలో చేరారు.. 2020లో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే కారణంతో బీజేపీ ఆయనను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఆయన తిరిగి టీడీపీలో చేరి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన గతంలో టీటీడీ పాలకమండలి సభ్యుడిగా కూడా పనిచేశారు. తిరుమల లడ్డూ నాణ్యత, ఆలయాల రక్షణ వంటి పలు అంశాలపై ఓవీ రమణ మాట్లాడారు. అయితే ఆయన టీడీపీకి రాజీనామా చేసి విజయసాయిరెడ్డి కొత్త పార్టీలో చేరతాననడం ఆసక్తికరంగా మారింది.

డిసెంబర్ లో ఏపీ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ !

విశాఖపట్టణం, నవంబర్ 3, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందనే ప్రచారం ఊపందుకుంది. ప్రధానమైన మున్సిపల్ ఎన్నికలు ముగియడం, రెండు రోజుల్లో జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు కూడా పూర్తికానున్నాయి. అదేవిధంగా ఈ నెల 26, 28 తేదీలతోపాటు డిసెంబరు 2న మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రహసనం ముగియనుంది. ఇక 2029 ఎన్నికలే టార్గెట్ గా ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు డిసైడ్ అయ్యారని అంటున్నారు. డిసెంబరు 2న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని సీఎం భావిస్తున్నారని పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2024 జూన్ లో రాష్ట్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే డిసెంబరుతో రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకుంటారు. ఇంకా రెండున్నరేళ్ల పాలన మిగిలివున్నప్పటికీ చివరి సంవత్సరం పూర్తిగా ఎన్నికలకే అంకితం చేయాల్సివుంటుందని అంటున్నారు. అంటే ఇంకా గట్టిగా ఏడాదిన్నర మాత్రమే ప్రభుత్వం పూర్తిస్థాయిలో పనిచేయనుందని, ఈ కారణంగా గత రెండున్నరేళ్ల పాలనను పునఃసమీక్షించుకోవడంతోపాటు లోపాలను సరిదిద్దుకునేందుకు వచ్చే ఏడాదిన్నర కాలం వినియోగించుకోవాలని సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఒకవైపు రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు తమ బాధ్యతలను ఎలా నిర్వహిస్తున్నారో కూడా పర్యవేక్షిస్తున్నారని చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన కూటమి పార్టీలలో చాలా మంది మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ఇందులో కొందరికి తొలివిడతలో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి త్వరలో విస్తరణ చేపట్టి ఎన్నికల జట్టును సిద్ధం చేయాలని భావిస్తున్నారని చెబుతు న్నారు. అయితే ప్రస్తుత మంత్రి వర్గంలో ఉన్నవారిలో కొందరిని తప్పించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలనే ఆలోచన చేస్తున్నారనే ప్రచారం హీట్ ఎక్కిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్షం వైసీపీకి గట్టి పునాదులు ఉన్న రాయలసీమ, పల్నాడు జిల్లాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. రాయలసీమలో ప్రస్తుతం ఏడుగురు మంత్రులు ఉండగా, ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని, వారితో ఎన్నికలకు వెళితే పార్టీకి పెద్దగా ప్రయోజనం ఉండదని సీఎం భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారు సొంత నియోజకవర్గం, జిల్లాల్లో వ్యతిరేకత ఎదు ర్కొంటుండటంపై ముఖ్యమంత్రి చంద్ర బాబుతీవ్రంగాఆలోచిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో చాలా మంది కొత్తవారికి అవకాశం ఇవ్వడం కూడా ఈ పరిస్థితికి కారణంగా సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో అనువజ్ఞులను తీసుకోవాలన్న ప్రతిపాదనను సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో వైసీపీని కంట్రోల్ చేసే నాయకుల కోసం సీఎం అన్వేషిస్తున్నారని చెబుతున్నారు.

స్థానిక ఎన్నికల ఫలితాలను చూసి మంత్రులు, కొత్తగా మంత్రి పదవులు ఇచ్చే నేతలపై ఒక అవగాహనకు రావాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. తమ జిల్లాలతోపాటు ఇంచార్జులుగా వ్యవహరిస్తున్న జిల్లాల్లో ఫలితాలను బేరీజు వేసి మంత్రుల పనితీరుపై అంచనాకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అదేసమయంలో ప్రత్యర్థిపై పైచేయి సాధించేలా వ్యూహరచన చేసిన నేతల సామర్థ్యాన్ని పరిశీలనకు తీసుకో వాలని, అటువంటి వారికి సముచిత గౌరవం కల్పించాలని సీఎం ఆలోచిస్తున్నారని అంటు న్నారు. దీంతో జడ్పీ, మండల పరిషత్ ఎన్ని కల్లో మంచి ఫలితాలు సాధించేలా మంత్రులు, ఎమ్మెల్యేలు పోటాపోటీగా పనిచేస్తున్నట్లు టీడీపీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి

ఖాళీ కుర్చీలను మార్ఫింగ్ తో కవర్ చేసుకుంటున్నారు

హైదరాబాద్ పది లక్షల మందితో దండయాత్ర అని బిల్డప్ ఇచ్చి.. రాంలీలా మైదానంలో 30 వేల మందిని కూడా పోగుచేయలేక ఖాళీ కుర్చీలను మార్ఫింగులతో కవర్ చేసుకుంటున్నారని బిజెపి నేత – ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యేచింతల రామచంద్రారెడ్డి విమర్శించారు.

ఇటీవల కర్ణాటక, బిహార్ వంటి రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే చిత్తుగా ఓడిపోయిన కాంగ్రెస్.. ఇప్పుడొచ్చి ఈవీఎంలు, 'ఓట్ చోరీ' అంటూ దొంగ ఏడుపులు ఏడవడం సిగ్గుచేటు. రాహుల్ జీ, జిమ్మిక్కులతో ఎవరూ పీఎం కాలేరు.. దేశాన్ని బదనాం చేసే మీ అబద్దాల దుకాణాన్ని ప్రజలు ఎప్పుడో మూసేశారని వ్యాఖ్యానించారు.

మురసుతో నీటి కష్టాలకు చెక్...

గుంటూరు, నవంబర్ 4, మురసు తుఫానుతో రాష్ట్రంలో రాయలసీమ, పల్నాడు జిల్లాలలో నీటి లోటు తీరే పరిస్థితి కనిపిస్తోంది. నెల్లూరు సమీపంలో తీరందాటనున్న మురసు కారణంగా దక్షిణకోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉండగా, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలను తట్టుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక తుఫాను హెచ్చరికలు, భారీ వరదలపై అంచనాలతో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం నుంచి సెక్రటేరియట్‌లో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో తిష్ట వేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలు జారీ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. అర్నాబ్ కంటే తక్కువ ప్రభావం కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు తెలిపారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని వివరించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెండు గంటలకు ఒకసారి బులెటిన్ వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓ సారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు. తుఫాను అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్నిమాపక సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వర్చువల్ గా హాజరయ్యారు.

స్వచ్ఛంద ఉద్యమం చేపట్టనున్న ధనుష్..

చెన్నై, నవంబర్ 3, (న్యూస్ పల్స్) కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గురించి ఇప్పుడు ఓ ఆసక్తికర విషయం ఫిల్మ్ వర్గాలతోపాటు సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తుంది. తన అభిమాన సంఘాన్ని ఇకపై స్వచ్ఛంద సంస్థగా మార్చనున్నట్లు ప్రచారం నడుస్తుంది. త్వరలోనే రాజకీయంలోకి అడుగుపెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే ఏవైనా న్యాయపరమైన సమస్యలను పరిష్కరించ డానికి దాదాపు 3వేల మంది న్యాయ సలహా దారులను నియమించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు రాజకీయాల గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. ఇటీవలే సొంతంగా పార్టీ ప్రారంభించి అఖండమైన మేజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు విజయ్ దళపతి. ఇప్పుడు ఆయన దారిలో మరో హీరో ధనుష్ సైతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హీరో త్వరలోనే రాజకీయ ప్రవేశం చేయనున్నారనే ప్రచారం తమిళనాడు సినీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటివరకు ఈ విషయం పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ నెట్టింట మాత్రం రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో న్యూస్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం ధనుష్ అభిమాన సంఘాన్ని స్వచ్ఛంద సంస్థగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది న్యాయసలహాదారులను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆన స్వచ్ఛంద సంస్థ 234 నియోజకవర్గాల కోసం ఏసీ సౌకర్యాలతో కూడిన ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతుందని ప్రచారం జరుగుతుంది.అభిమాన సంఘం ఒక స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, రాజకీయ మార్గంలో భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు సమాచారం. మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ వీరిని నియమిస్తే, ప్రతి నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని అంటున్నారు. భవిష్యత్తులో ధనుష్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులపై ఉన్న కేసులను పరిష్కరించడంలో, నిరసనల సమయంలో తలెత్తే చట్టపరమైన సమస్యలలో, స్థానిక సమస్యలలో వారు సహాయపడవచ్చని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇటీవల, ధనుష్ స్వచ్ఛంద సంస్థ వరుసగా అనేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, అక్టోబర్ 15, 2026న, ఫ్యాన్స్ క్లబ్‌ను స్వచ్ఛంద సంస్థగా మార్చి, ఒక జెండా , లోగోను ఆవిష్కరించారు.దీని తర్వాత, అక్టోబర్ 18, 2026న జరిగిన మహిళా బృంద నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న 3,000 మందికి పైగా మహిళా నిర్వాహకులకు ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి దీపాన్ని బహూకరించారు. దీని తర్వాత, జనవరి 2027 నుండి మొత్తం 234 నియోజకవర్గాలలో 10వ, ప్లస్ 2 విద్యార్థుల కోసం ఏసీ సౌకర్యాలతో ఉచిత ట్యూషన్ కేంద్రాలను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ప్రకటించారు. దీనిలో భాగంగా, ఆయన ఢిల్లీలోని ప్రముఖులను కలిశారని, కొత్త పార్టీకి పేరు నమోదు చేశారని వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిలో ఏదీ అధికారికంగా ధృవీకరించబడలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ముందు, తన అభిమాన సంఘాలను 'విజయ్ మక్కల్ ఉద్యమం'గా మార్చి ప్రతి జిల్లాలో సంక్షేమ సహాయం అందించారు. ఆ తర్వాత, ఆయన పార్టీని ప్రారంభించి, తాను పోటీ చేసిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. ధనుష్ కూడా అభిమాన సంఘాన్ని ఒక ఉద్యమంగా మార్చడం, నియోజకవర్గాల వారీగా నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం, ప్రజా సంక్షేమ పనుల్లో నిమగ్నమవడం వంటి అదే మార్గాన్ని అనుసరించడం ప్రారంభించారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తన రాజకీయ ప్రవేశంపై ధనుష్ ఇప్పటివరకు స్పందించలేదు.

స్పందన రాని అమిత్ షా రోడ్ షో అద్దంకి దయాకర్

హైదరాబాద్ రాహుల్ గాంధీ ర్యాలీ దెబ్బకు అమిత్ షా హైదరాబాద్ రోడ్లపై పడి పోటీ ర్యాలీ చేశాడు. అమిత్ షా ర్యాలీకి బీజేపీ కార్యకర్తలు, ప్రజల నుంచి కూడా స్పందన రాలేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్పై ఉందని అమిత్ షా అంటున్నాడు.. కానీ బీజేపీ క్రిటికల్ ఐసీయూలో ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మోదీ, అమిత్ షా అనే ముసలి నక్కల పాలన పోవాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మోదీ, అమిత్ షా ట్యాక్స్ కడుతున్నారా..? మీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి అక్రమాలు జరుగుతుంటే పట్టించుకోరు.. నిజాయితీగా పరిపాలిస్తున్న రేవంత్ రెడ్డిని దింపాలని మాట్లాడుతున్నారు.. రేవంత్ రెడ్డిని దింపడం కాదు.. కేంద్రంలో మిమ్మల్ని దింపుతాం చూసుకోండని అన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఆరు గ్యారెంటీలను మా ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారు. కేంద్రం నుంచి పైసా సాయం కూడా చేయకుండా విమర్శలు చేస్తారా..? ఏదో గ్యారెంటీగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను మా ప్రజా ప్రభుత్వం ఇస్తోంది. తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనివ్వరు. తెలంగాణలో బీజేపీకి అధికారం ఎప్పటికీ సాధ్యం కాదు. ప్రధాని మోదీ నుంచి బీజేపీ ఎంపీల వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. రేవంత్ రెడ్డినే భవిష్యత్తులో రాహుల్ గాంధీకి ప్రధాన ఆయుధంగా అవుతాడన్న ఉద్దేశంతోనే అమిత్ షా హైదరాబాద్ వచ్చారు. బీజేపీ పతనం మొదలైంది... ముందు అది గుర్తుపెట్టుకోండని అన్నారు..

కేంద్ర ఉద్యోగులకు పెరగనున్న డీఏ

న్యూఢిల్లీ, నవంబర్ 3, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కరువు భత్యం , కరువు ఉపశమనంలను 3 శాతం పాయింట్లు పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉద్యోగుల డీఏ, పింఛనుదారుల డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరగనున్నాయి. దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పింఛనుదారులు ప్రయోజనం పొందనున్నారు.డీఏ పెంపు ఉద్యోగుల ప్రాథమిక వేతనంపై ఆధారపడి ఉంటుంది. అంటే ప్రాథమిక వేతనంలో 3 శాతం పాయింట్ల మేరకు అదనపు భత్యం లభిస్తుంది. ఉదాహరణకు, రూ.18,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం 60 శాతం డీఏ ప్రకారం రూ.10,800 లభిస్తోంది. కొత్త రేటు 63 శాతానికి చేరితే ఈ మొత్తం రూ.11,340 అవుతుంది. అంటే నెలకు అదనంగా రూ.540 అందుతుంది. అలాగే, రూ.35,400 ప్రాథమిక వేతనం ఉన్న ఉద్యోగికి నెలకు రూ.1,062 అదనంగా లభిస్తుంది. రూ.50,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి నెలవారీ డీఏ రూ.30,000 నుంచి రూ.31,500కు పెరుగుతుంది. దీంతో నెలకు రూ.1,500 అదనపు ప్రయోజనం కలుగుతుంది.మోదీ సర్కార్ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకూ ప్రయోజనం కలుగుతుంది. వారి అర్హతగల ప్రాథమిక పింఛనుపై డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరుగుతుంది. దీంతో నెలవారీ పింఛను ఆదాయంలో పెరుగుదల ఉంటుంది.డీఏ, డీఆర్ పెంపుతో కేంద్ర ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ.10,016 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనున్నట్లు సమాచారం. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావాన్ని తగ్గించి, ఉద్యోగులు, పింఛనుదారులకు ఆర్థిక ఊరట కల్పించడం ఈ నిర్ణయం ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు జనవరి 1, జూలై 1 తేదీల నుంచి అమలయ్యేలా డీఏ, డీఆర్ రేట్లను సవరిస్తుంది. అయితే తాజా పెంపు అమలు తేదీ, బకాయిల చెల్లింపుపై తుది స్పష్టత కోసం అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది.

కమలానికి దగ్గరవుతున్నచిరంజీవి

హైదరాబాద్, నవంబర్ 3, మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో అందరి వాడు. పరిశ్రమకు పెద్ద దిక్కు. ఆయన పెద్దరికం మీద అందరికీ నమ్మకం ఉంది. అనేక సమస్యలను ఆయన పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇక చిరంజీవి స్వభావానికి రాజకీయాలు పడవని సన్నిహితులు అంటారు. ఆయన మెత్తని స్వభావం కలిగిన వారు. అందుకే ఆయన రాజకీయాల్లోకి ఎంత తొందరగా వెళ్లాలో అంతే వేగంగా వెనక్కి తిరిగారు. అది కూడా ఎలాంటి విమర్శలు పెద్దగా లేకుండానే గౌరవంగా తప్పుకున్నారు. ఇక తన జీవితం అంతా సినిమాలకే అంకితం అని ఆయన పదే పదే అనేక సార్లు చెప్పి ఉన్నారు. అయినా సరే మెగాస్టార్ చుట్టూ ఎపుడూ రాజకీయ ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆయన విషయంలో మరోసారి అలాంటి వార్తలే ప్రచారంలో ఉంటూ వస్తున్నాయి. అమిత్ షాతో భేటీ : ఇదిలా ఉంటే హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి బీజేపీ అగ్ర నేత అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి ఆయన కుమారుడు రామ్ చరణ్ తో పాటుగా వెళ్ళి కలిశారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నా కూడా చిరంజీవి రాజకీయం గురించి మరోసారి చర్చించే విధంగా వార్తా కథనాలు అల్లుతున్న వారూ ఉన్నారు. అయితే అమిత్ షాను కలిసిన ప్రముఖులలో అనేక రంగాలకు చెందిన వారు ఉన్నారు. అందులో మై హోం నుంచి రామేశ్వరరావు, అలాగే ఒక ప్రముఖ తెలుగు టీవీ చానెల్ అధినేత ఇంకా అనేక మంది ఉన్నారు. అయితే అందరి దృష్టి మాత్రం మెగాస్టార్ మీదనే ఉంది. ఎందుకంటే ఆయన సినీ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి, అంతే కాదు జనసేన అధినేత పవన్ కి సోదరుడు కాబట్టి అని అంటున్నారు. ఇక పవన్ ఏపీలో కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా ఉన్నారు. ఆ కూటమిలో బీజేపీ కూడా ఉంది. అలా ఆ బంధాన్ని కూడా కలుపుతూ చిరంజీవి రాజకీయాల మీద చర్చించే వారూ ఉన్నారు. అయితే అమిత్ షాని చిరంజీవి కలవడం వెనక రాజకీయం లేదని అంటున్నారు. కేవలం మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్ సినీ రంగం పరిస్థితులలో పాటు తమ సినిమాల గురించి చర్చకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇక చిరంజీవి విషయానికి వస్తే ఆయన రాజకీయంగా అందరి వాడుగా ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఆయనకు పార్టీలతో సంబంధం లేదని కూడా అంటున్నారు. ఏపీలో ఈ మధ్య పర్యటించిన మెగాస్టార్ కూటమి ప్రభుత్వం పాలన బాగుందని చెప్పారని అంటున్నారు. అలాగే రేవంత్ రెడ్డితో కూడా అనేక వేదికలు పంచుకున్నారని అంటున్నారు. ఇలా అందరి వాడుగా ఉంటూ వస్తున్న చిరంజీవి రాజకీయాలలో క్రియాశీలకం అవుతారు అన్నది కేవలం ఊహాగానాలే అని అంటున్నారు.అయితే కమలం పార్టీకి ఆశలు మాత్రం ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ కూటమిలో ఉన్నారు. చిరంజీవి వంటి బిగ్ ఫిగర్ కనుక తమతో ఉంటే తెలంగాణాలో కూడా అధికారానికి మరింత సులువు అవుతుందన్న లెక్కలు బీజేపీకి ఉన్నాయని చెబుతున్నారు. అయితే చిరంజీవి తిరిగి రాజకీయాల్లోకి వస్తారా అంటే అది ఈజీ కాదు కదా అసలు కుదిరే వ్యవహారం కానే కాదని అంటున్నారు. ఒక విధంగా చిరంజీవి రాజకీయం అన్నది ముగిసిన అధ్యాయం అని కూడా అంటున్నారు. అయితే కాలం ఎపుడూ గొప్పది చూడాలి మరి ఊహాగానాలు అలాగే ఉంటాయా లేక ఏమవుతాయి అన్నది.

తెలంగాణ పొలిటికల్ గేమ్‌లో జగన్ దారెటు

హైదరాబాద్, నవంబర్ 3 తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిల మధ్య ఉన్న సాన్నిహిత్యం, ఆ రెండు పార్టీల మధ్య ఉన్న సత్సంబంధాలు అందరికీ తెలిసినవే. గడిచిన కొన్నేళ్లుగా ఒకరికొకరు నైతిక మద్దతు ఇచ్చుకుంటూ వచ్చారు. కానీ, మారిన తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో భాగంగా కేటీఆర్ తీసుకుంటున్న కొత్త రాజకీయ వ్యూహం ఇప్పుడు పొరుగు రాష్ట్రంలో ఉన్న తన ఆప్తమిత్రుడు జగన్‌మోహన్ రెడ్డిని ఇరకాటంలో పడేస్తోంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడానికి కేటీఆర్ పదే పదే ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు నాయుడు సర్కార్ పాలనను, అక్కడ జరుగుతున్న వాటర్ మేనేజ్‌మెంట్‌ని ప్రశంసించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో.. మా తెలంగాణలోనే సంక్షేమం, అభివృద్ధి వేగంగా సాగుతున్నాయి, పొరుగున ఉన్న ఏపీలో విద్యుత్ కోతలు, దారుణమైన రోడ్లు ఉన్నాయి అంటూ కేటీఆర్, ఇతర గులాబీ నేతలు పరోక్షంగా విమర్శించేవారు. అప్పుడు ఏపీలో సీఎంగా ఉన్నది తన మిత్రుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అయినప్పటికీ, తెలంగాణ మోడల్‌ను గొప్పగా చాటుకోవడానికే కేటీఆర్ ఏపీని తక్కువ చేసి మాట్లాడారు. ఇక ఇప్పుడు సీన్ తలకిందులైంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం పీఠం ఎక్కడంతో.. రేవంత్ రెడ్డి నమూనా ఎంత దారుణంగా ఉందో చూపించే క్రమంలో చూడండి, పక్క రాష్ట్రమైన ఏపీలోనూ ఎల్‌నినో ఉంది, కానీ అక్కడ చంద్రబాబు ప్రభుత్వం పరిస్థితులను ఎంత పక్కాగా మేనేజ్ చేస్తోంది! అంటూ చంద్రబాబు వైపు కితాబుల వర్షం కురిపిస్తున్నారు.ఈ వ్యూహంలో కేటీఆర్‌కు ఎలాంటి స్వార్థ రాజకీయ స్వార్థం లేకపోవచ్చు. కేవలం తెలంగాణ కాంగ్రెస్‌పై దాడి చేయడమే ప్రధాన ఉద్దేశం కావచ్చు. కానీ, కేటీఆర్ నోటి వెంట వస్తున్న ఈ మాటలు నేరుగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ రాజకీయ మనుగడకు, ప్రతిపక్ష పోరాటానికి పెను శరాఘాతంగా మారుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, కరవును ఎదుర్కోవడంలో చంద్రబాబు చేతులెత్తేశారని వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేస్తుంటే.. తెలంగాణ నుంచి జగన్ మిత్రుడే అయిన కేటీఆర్ వచ్చి ఆంధ్రాలో చంద్రబాబు పాలన, వాటర్ మేనేజ్‌మెంట్ బాగుంది అని సర్టిఫికేట్లు ఇవ్వడం వైసీపీ ప్రచారానికి పూర్తిగా గొడ్డలిపెట్టులా మారుతోంది. టీడీపీ నేతలు, మద్దతుదారులు కేటీఆర్ కామెంట్లను ఆయుధంగా మలుచుకుని నెట్టింట విరుచుకుపడుతున్నారు. జగన్ సన్నిహితుడైన కేటీఆర్ కూడా కూటమి ప్రభుత్వ పాలనను మెచ్చుకుంటున్నారు, ఇక జగన్ చెప్పే కల్పిత విమర్శలను ఎవరు నమ్ముతారు? అంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. దీంతో ఏపీలో వైసీపీ నేతలు ప్రతిసారీ కేటీఆర్ వ్యాఖ్యలకు సమర్థన ఇచ్చుకోలేక, అలాగని మిత్రుడిని విమర్శించలేక తీవ్ర మానసిక మథనానికి గురవుతున్నారు. జగన్‌ను కన్ఫ్యూజన్‌లో పడేస్తున్న ఈ కామెంట్లు వైఎస్సార్‌సీపీ క్యాడర్‌కు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి.రాజకీయంలో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు అనే నానుడితో పాటు సొంత ఇంటి సంక్షోభం ముందర పొరుగువారి స్నేహం ద్వితీయమే అనే సూత్రం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్‌కు ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డిని దెబ్బతీయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మళ్లీ బలమైన పునాదిపై నిలబెట్టడం మాత్రమే ఏకైక ప్రాధాన్యత. అందుకోసం వైరి వర్గమైన చంద్రబాబునైనా సరే మెచ్చుకోవడానికి ఆయన వెనుకాడటం లేదు. ఈ క్రమంలో తన మిత్రుడు జగన్‌కు రాజకీయంగా ఎంత నష్టం జరుగుతోందనే అంశాన్ని కేటీఆర్ పూర్తిగా పక్కన పెట్టేసినట్లే కనిపిస్తోంది. తమ సొంత ప్రయోజనాలు, రాజకీయ వ్యూహాల కోసమే కేటీఆర్ ఆంధ్రాను వాడుకుంటుండటంతో, స్నేహానికి-రాజకీయ అవసరాలకు మధ్య ఉన్న స్పష్టమైన సరిహద్దులు బయటపడ్డాయి. మిత్రుడి ఇబ్బందులను పక్కనపెట్టి కేటీఆర్ సాగిస్తున్న ఈ సెల్ఫ్-పొలిటికల్ గేమ్ రాబోయే రోజుల్లో జగన్-కేటీఆర్‌ల చెలిమిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో, ఏపీ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ దీనికి ఎలా కౌంటర్ ఇస్తుందో వేచి చూడాలి.

లేడీస్ హాస్టల్లో అగ్నిప్రమాదం

మేడ్చల్ నాచారం పీఎస్ పరిధిలోని లేడీస్ హాస్టల్లో అగ్నిప్రమాదం జరిగింది. స్థానిక సావర్కర్ నగర్లో ఘటన చోటు చేసుకుంది. శ్రీ లక్ష్మి లేడీస్ హాస్టల్లో షార్ట్ సర్క్యూట్తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలతో స్థానికులు భయాందోళనకు గురైయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

మళ్లీ తెరపైకి రాజీనామాతో రాజ్ గోపాల్ రెడ్డి

నల్గొండ, నవంబర్ 3, మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి రేవంత్ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

తన నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూపాయి నిధులు ఇవ్వడం లేదని, చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ.. నియోజకవర్గ ప్రయోజనాల కోసం అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమంటూ బహిరంగంగా ప్రకటన చేశారు. మునుగోడులో కనీసం రోడ్డు వేసుకోవడానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి నిధులు ఇవ్వడం లేదు.. నేను ఎవరికీ భయపడను, ఎవరితోనూ రాజీపడను అంటూ ఆయన నేరుగా ముఖ్యమంత్రిపైనే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.పైకి నియోజకవర్గ నిధులు, అభివృద్ధి పనుల కొరతను కారణంగా చూపుతున్నప్పటికీ.. రాజగోపాల్ రెడ్డి అసహనం వెనుక సుదీర్ఘకాలంగా రగులుతున్న అసంతృప్తి జ్వాలలు ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశపడుతూ వచ్చారు. ఆ అవకాశాలు కనిపించడం లేదు. ఈ అసంతృప్తికి తోడు, ఇటీవల డియల్ రోడ్డు ప్రాజెక్టు కాంట్రాక్ట్ వివాదం రాజగోపాల్ రెడ్డికి మరింత తలనొప్పిగా మారింది. తన సొంత వ్యాపార, నిర్మాణ ప్రయోజనాలకు సంబంధించిన పనుల్లోనూ ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం అందకపోవడం, రాజకీయంగా తనను ఉద్దేశపూర్వకంగా అణగదొక్కుతున్నారనే భావన ఆయనను ఆందోళనకు గురిచేసింది.ఓ వైపు సొంత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రాజకీయ ప్రాధాన్యత దక్కకపోవడం, మరోవైపు వ్యాపార కాంట్రాక్టుల విషయంలోనూ నిరాశే ఎదురుకావడంతో ఆయన నిప్పుల మీద నడుస్తున్నంతగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలా అన్ని వైపుల నుంచీ అసంతృప్తి పెరగడంతో ఇక సర్దుకుపోయే ప్రసక్తే లేదని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికే రాజగోపాల్ రెడ్డి మానసికంగా సిద్ధపడినట్లు కనిపిస్తోంది.గతంలోనూ పార్టీపై అసంతృప్తితో ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉప ఎన్నికకు వెళ్లిన చరిత్ర ఆయనకుంది; ఇప్పుడు మరోసారి రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి తీవ్రమైన హెచ్చరికలు పంపారు. నిధులు, మంత్రి పదవి, కాంట్రాక్ట్ వివాదాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వేసే అడుగులు రాజీనామా దిశగా ఉండే అవకాశం ఉంది.

కొత్త బాదుడుకు తెర తీసిన రెరా

హైదరాబాద్, నవంబర్ 3, హైదరాబాద్ వ్యాప్తంగా నిర్మాణం జరుపుకుంటున్న లగ్జరీ హైరైజ్ అపార్ట్‌మెంట్లలో నివసించాలని సగటు గృహ కొనుగోలుదారులు ఎంతో ముచ్చటపడతారు. కాలుష్యానికి దూరంగా, ఆహ్లాదకరమైన గాలి, వెలుతురుతో పాటు నగర అందాలను పైనుంచి వీక్షించవచ్చనే ఆశతో చాలామంది పై అంతస్తుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతారు. అయితే కొనుగోలుదారుల ఈ ఆశనే బిల్డర్లు వ్యాపార అవకాశంగా మలచుకుని ఫ్లోర్ రైజ్ ఛార్జీలు పేరుతో అదనపు బాదుడు బాదుతుండటం ప్రాపర్టీ మార్కెట్‌లో చర్చనీయాంశమవుతోంది. సాధారణంగా బిల్డర్లు నిర్ణయించే బేసిక్ ఎస్ఎఫ్‌టీ ధర అనేది భవనంలోని దిగువ అంతస్తులకే వర్తిస్తుంది. నిబంధనల ప్రకారం 6వ అంతస్తు నుంచి ప్రారంభించి పైకి వెళ్లే ప్రతి అదనపు అంతస్తుకు చదరపు అడుగుకు రూ. 20 చొప్పున ఫ్లోర్ రైజ్ రుసుముగా అదనంగా జోడిస్తారు. అంటే మీరు భవనంలో ఎంత ఎత్తుకి వెళ్లి, అంత ప్రశాంతతను అనుభవించాలనుకుంటే మీ జేబుకు అంత పెద్ద కన్నం పడుతుందన్న మాట. ఉదాహరణకు 3,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్ కొనుగోలు చేసే వ్యక్తి, 16వ అంతస్తును ఎంచుకుంటే కేవలం ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీల రూపంలోనే రూ. 6.60 లక్షలకు పైగా అదనంగా చెల్లించాల్సి వస్తోంది.

ఎత్తైన అంతస్తుల్లో నివసించడం వల్ల మెరుగైన వ్యూ , తక్కువ శబ్దం, పరిశుభ్రమైన గాలి లభిస్తాయని బిల్డర్లు ఈ రుసుములను సమర్థించుకుంటారు. అయితే ఇదే సమయంలో భవనం ఎత్తు పెరిగేకొద్దీ నిర్మాణ వ్యయంలో లిఫ్టుల వేగం, ప్రీమియం గ్లాస్, భద్రతా వ్యవస్థలు , నిర్మాణాత్మక ఇంజనీరింగ్ ఖర్చులు పెరుగుతాయని డెవలపర్లు స్పష్టం చేస్తున్నారు. కానీ ఎలాంటి అదనపు విస్తీర్ణం రాకపోయినా, కేవలం ఎత్తులో ఉందనే ఒకే ఒక్క కారణంతో లక్షల రూపాయల అదనపు భారం మోయాల్సి రావడంపై కొనుగోలుదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.అంతిమంగా చూస్తే ప్రాథమిక ఎస్ఎఫ్‌టీ ధర తక్కువగా కనిపించినప్పటికీ, 15, 20 లేదా 30 అంతస్తుల్లో ఫ్లాట్లను ఎంచుకున్నప్పుడు ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీలే లక్షల రూపాయల్లోకి చేరి కొనుగోలుదారుల మొత్తం బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. దీంతోపాటు ఈ అదనపు ధరపై కూడా జీఎస్‌టీ భారం పడుతుండటం గమనార్హం. అందువల్ల హైరైజ్ ప్రాజెక్టుల్లో ఇళ్లను ఎంచుకునేటప్పుడు కేవలం ఎత్తుకే ప్రాధాన్యమివ్వకుండా, ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీల లెక్కలను ముందే సరిచూసుకుని సరైన అంతస్తును ఎంచుకోవాలని రియల్ ఎస్టేట్ నిపుణులు సూచిస్తున్నారు.

ఒక్క వానకే హైదరాబాద్ చెరువుల కళకళ..

హైదరాబాద్, నవంబర్ 3, ఒకప్పుడు మురుగుతో నిండి.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఉపిరిసలుపుకోని ఆ చెరువులు.. నేడు హైడ్రా సంకల్ప బలం.. ఒకే ఒక్క వాన ధాటికి సరికొత్త జీవనాన్ని సంతరించుకున్నాయి. ఎండిపోయిన జాడ నుంచి స్వచ్ఛమైన జలకళతో తొణికిసలాడుతూ నగర ప్రజల దాహార్తిని తీర్చే అమృత ధారలుగా మారుతున్న ఆ జలాశయాల విజయగాథే ఈ నేటి చారిత్రక పరిణామం. ఎల్‌నినో ప్రభావంతో వాన చినుకు కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగర ప్రజలకు వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. శుక్రవారం కురిసిన సుమారు 7 సెంటీమీటర్లు భారీ వర్షం హైదరాబాద్ వాసుల మోములపై చిరునవ్వులు పూయించింది. ముఖ్యంగా మాదాపూర్‌లోని సున్నం చెరువు , తమ్మిడికుంట జలాశయాలు వర్షపు నీటితో కళకళలాడుతుండటం స్థానికుల్లో అమితానందాన్ని నింపుతోంది.

ఒకప్పుడు ఈ చెరువుల పరిస్థితి చూస్తే కన్నీళ్లే మిగిలేవి. మురుగు నీరు.. భారీగా పేరుకుపోయిన పూడిక.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఆ చెరువులు దుర్గంధం వెదజల్లాయి. నీటి జాడ లేక ఎండిపోయి వెలవెలబోయిన ఆ జలాశయాలను చూసి స్థానికులు ఆవేదన చెందేవారు. కానీ నేడు ఆ దృశ్యాలు పూర్తిగా మారిపోయాయి. నగరంలోని చెరువులను కాపాడేందుకు 'హైడ్రా' చేపట్టిన సంకల్పం ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తోంది. సున్నం చెరువులో దశాబ్దాలుగా పేరుకుపోయిన 10 నుంచి 15 అడుగుల పూడికను హైడ్రా తొలగించింది. ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు.. చుట్టూ వాకింగ్ పాత్‌వేలు, పిల్లల కోసం ఆటస్థలాలు, పూలు, మొక్కలతో ఆ ప్రాంతాన్ని ఒక సుందరమైన పర్యావరణ కేంద్రంగా తీర్చిదిద్దింది. అయితే చెరువులను అందంగా చేయడం ఎంత ముఖ్యమో.. వాటిలోకి వర్షపు నీరు చేరేలా చేయడం అంతకంటే ముఖ్యం. ఈ వాస్తవాన్ని గుర్తించిన హైడ్రా అధికారులు.. రోడ్లపై వృథాగా పారే వర్షపు నీరు నేరుగా చెరువులోకి చేరేలా ప్రత్యేకంగా 'ఇన్‌లెట్లను' ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే ఇన్‌లెట్లు ఆ ప్రాంతానికి జీవనాధారంగా మారాయి. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ప్రవహించాల్సిన నీరంతా నేరుగా సున్నం చెరువులోకి పరుగులు పెట్టింది. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. తమ కళ్ల ముందే చెరువు నీటితో నిండుతుండటం చూసి పరవశించిపోయారు. కొందరైతే ఈ ఆనంద క్షమాలను వీడియోలు తీసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు పంపి తమ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ చెరువులు, ప్రారంభోత్సవానికి ముందే జలకళ సంతరించుకోవడం శుభపరిణామమని స్థానికులు ఉప్పొంగిపోతున్నారు.

ఈ వర్షపు నీరు చెరువులో నిలవడం వల్ల కేవలం అందం మాత్రమే కాదు.. వేలాది మందికి తాగునీటి భద్రత చేకూరుతుంది. ఎండిపోయిన బోర్లు మళ్లీ ఊపిరి పీల్చుకుంటాయని.. భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. "చెరువులు బతికితేనే నగరానికి భవిష్యత్తు" అనే నినాదానికి హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ పనులు నిజ రూపం ఇస్తున్నాయి. మురుగు కూపాలుగా ఉన్న జలాశయాలు స్వచ్ఛమైన వర్షపు జలాలతో కళకళలాడుతుంటే.. హైదరాబాద్ భవిష్యత్తుపై భరోసా కలుగుతోంది.

జగన్‌పై కేసు నమోదు

అనుమతి లేకుండా ధర్నా చేశారంటూ కేసు నమోదు

వైసీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ అధినేత జగన్‌పై పోలీసు కేసు నమోదయింది. కడప జిల్లా పులివెందులలో జగన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున అనుమతి లేకుండా ధర్నా చేసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయనపై ఆరోపణలు నమోదయ్యాయి. నవంబర్ 1వ తేదీన జరిగిన పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. తమ పార్టీ ఏజెంట్లను చాలా పోలింగ్ బూత్‌లలోకి రానివ్వడం లేదని ఆరోపిస్తూ జగన్ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలింగ్‌ను వెంటనే రద్దు చేసి, రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ముందస్తు అనుమతి లేకుండా ఆందోళన చేపట్టారని టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో పులివెందుల అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, పులివెందులలో రీపోలింగ్ నిర్వహించాలని కోరుతూ వైసీపీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. ఓట్ల లెక్కింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైకోర్టులో పిటిషన్ తిరస్కరణకు గురైన రోజే, ధర్నా ఘటనపై జగన్‌పై కేసు నమోదు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్ కు దూరంగా.. బీఆర్ఎస్ కు దగ్గరగా బీజేపీ

హైదరాబాద్, నవంబర్ 3, మొత్తానికి కమలం పార్టీ అధిష్టానానికి తెలంగాణ గుర్తుకొచ్చింది. ఇక్కడ 8 మంది ఎంపీలు ఉన్నారనే విషయాన్ని ఇప్పుడు యాదికి తెచ్చుకుంది. ఇన్ని రోజులపాటు పార్టీని గాలికి వదిలేసిన అధిష్టానం.. మొత్తానికి ఏదో సీరియస్ ఎఫర్ట్ పెట్టినట్టుంది. ఇప్పటికే ఈటల రాజేందర్ సొంతంగా పాదయాత్ర చేస్తానని ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు మిగతా ఎంపీలు ఎవరి దారి వారు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కొంతకాల క్రితం ఈటల రాజేందర్.. బండి సంజయ్ మధ్య ఎలాంటి వ్యవహారాలు సాగాయో అందరికీ తెలుసు.అకస్మాత్తుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చారు. మహా పాదయాత్ర నిర్వహించారు. వాస్తవానికి ఆయన ప్రసంగంలో ఈసారి కాస్త వేరే కోణం కనిపించింది. ప్రారంభం నుంచి చివరి దాకా కాంగ్రెస్ పార్టీ మీద ఆయన మండిపడ్డారు. బహుశా ఇటీవల కాలంలో రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాల వల్ల కలిగిన ఇబ్బంది కావచ్చు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్ళతో పెకిలిస్తామని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోతే.. తదుపరి తెలంగాణ పీఠాన్ని బిజెపి అధిష్టిస్తుందా.. ఈ ప్రశ్నకు అవును అని అమిత్ షా సమాధానం చెప్పగలరా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.వాస్తవానికి అమిత్ షా చేపట్టిన మహా పాదయాత్ర ఉద్దేశం ఏమిటో తెలియదు గానీ.. ఇప్పటికే బీజేపీలో లుకలుకలు బయట పడుతున్నాయి. ఇటీవల పార్టీ తెలంగాణ ఇన్చార్జి ఓపెన్ గానే పార్టీలో ఉన్న పరిస్థితిని బయటపెట్టేశారు. నేతలు ఎవరికి వారు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని.. అసలు పార్టీ అభివృద్ధి కోసం పనిచేయడం లేదని.. పార్టీ కోసం పనిచేయని వ్యక్తులకు పదవులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అంతేకాదు అదే వేదిక మీద చాలామంది నాయకులను కడిగిపారేశారు. పార్టీ పరిస్థితి దారుణంగా ఉందని ఆయన అరిష్టానానికి నివేదిక ఇచ్చారు. బహుశా అందువల్లే అమిత్ షా ఇక్కడికి వచ్చి ఉంటారని తెలుస్తోంది. వాస్తవానికి 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణలో బిజెపికి మంచి ఊపు ఉండేది. పైగా.. బండి సంజయ్ నెత్తురుత్వంలో బిజెపి దూకుడు మీద ఉండేది. ఎప్పుడైతే బండి సంజయ్ ను పక్కనపెట్టి.. కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారో.. అప్పుడే పరిస్థితి మారిపోయింది. అధికారంలోకి వస్తుంది అనే ధీమా నుంచి.. పట్టుమని పది సీట్లు గెలుచుకోలేని దుస్థితికి బిజెపి పడిపోయింది..ఇక పార్లమెంటు ఎన్నికల్లో కాస్త పర్వాలేదు అనుకున్నప్పటికీ.. స్థానిక ఎన్నికల్లో సత్తా చూపించలేకపోయింది. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఏ మేరకు దూకుడు చూపిస్తుందో చూడాలి. గతంలో మాదిరిగా ఇప్పుడు ఆ పార్టీ నేతలు పని చేస్తారా.. అంతటి అవకాశం ఉందా.. ఈ ప్రశ్నలకు బిజెపి నాయకులే సమాధానం చెప్పాలి. అన్నట్టు గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమిత్ షా భీకరంగా వ్యాఖ్యలు చేశారు. కానీ కెసిఆర్ కుటుంబంలో ఒకరిని కూడా జైలుకు పంపించలేకపోయారు.. ఇప్పుడు కాంగ్రెస్ విషయంలో కూడా అమిత్ షా అదే స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. అంటే ఇప్పుడు కూడా అదే సీన్ రిపీట్ అవుతుందా.. అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.. కానీ అమిత్ షా మొత్తం ప్రసంగంలో గులాబీ పార్టీ ప్రస్తావన లేదు. అంటే ఆ పార్టీ అవినీతికి.. ఇతర దుర్మార్గాలకు అమిత్ షా క్లీన్ చీటీ ఇచ్చినట్టేనా.. అన్నట్టు కాళేశ్వరం.. ఇతర కేసుల్లో నిజాలు బయట పెట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆహ్వానిస్తున్నట్టు ఆ మధ్య రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసులను కూడా అప్పగించారు. మరింత వరకు ఒక అరెస్టు కూడా జరగలేదు.. మరి దీనిపై అమిత్ షా సమాధానం చెప్పలేదు. అసలు ఆ విషయాన్ని ప్రస్తావించలేదు.

రాప్తాడు దాడి నిందితుడి కుడి కాలు తొలగింపు..

కొనసాగుతున్న చికిత్స

పోలీసుల కాల్పుల్లో గాయపడటంతో అనివార్యమైన శస్త్రచికిత్స

సోమవారం అర్ధరాత్రి అనంతపురం జీజీహెచ్‌లో ఆపరేషన్ పూర్తి

అరెస్టును ప్రతిఘటించి దాడికి యత్నించడంతో పోలీసుల కాల్పులు

ప్రస్తుతం ఐసీయూలో చికిత్స.. నిలకడగా ఆరోగ్యం

అనంతపురం రాప్తాడులో ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థినిపై చైన్‌సాతో దాడికి పాల్పడిన నిందితుడు హేమంత్ తన కుడి కాలును కోల్పోయాడు. అరెస్టు సమయంలో పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడటంతో, వైద్యులు అతడి కాలును తొలగించాల్సి వచ్చింది.



సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (జీజీహెచ్) ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో హేమంత్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో అతడు లొంగిపోకుండా ప్రతిఘటించడమే కాక, ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దాడికి ప్రయత్నించాడు. పోలీసులు హెచ్చరికగా కాల్పులు జరిపినా వెనక్కి తగ్గకపోవడంతో, ఆత్మరక్షణ కోసం నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో హేమంత్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే, కుడి కాలిలో రక్త ప్రసరణ పూర్తిగా నిలిచిపోయి కణజాలం దెబ్బతినడంతో, మోకాలి పైభాగం నుంచి కాలును తొలగించడం తప్పనిసరి అయింది. దెబ్బతిన్న రక్తనాళాల కారణంగా ఎడమ కాలికి కూడా వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం హేమంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని వైద్యులు వెల్లడించారు. అక్టోబర్ 31న రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి గదిలోకి చొరబడిన హేమంత్, చైన్‌సాతో ఇద్దరు విద్యార్థినులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గోపిక అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడగా, బెంగళూరులో చికిత్స అనంతరం కోలుకుంటోంది. ఆమెను కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఇంటి నుంచే లెర్నర్ లైసెన్స్ టెస్ట్..

ఖీూ కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేదు..!

హైదరాబాద్, నవంబర్ 3, లెర్నర్ లైసెన్స్ పరీక్షను ఇంటి నుంచే రాసే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు తెలంగాణ రవాణాశాఖ సిద్ధమవుతోంది. అందుకు సారథి న్యూ లెర్నర్ లైసెన్స్ పరీక్ష వ్యవస్థతో పాటు ఏఐ, ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతను ఉపయోగించనున్నారు. అభ్యర్థి గుర్తింపు, పరీక్ష సమయంలో కదలికలు, మాల్‌ప్రాక్టీస్‌ను సాంకేతికంగా పర్యవేక్షిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి వెంటనే క్యూఆర్ కోడ్ ఆధారిత ఎల్ఎల్ఆర్ జారీ చేయనున్నారు. ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతమైతే వారం రోజుల్లోనే కొత్త విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.వాహనాలు నడపడం నేర్చుకునే ముందు తప్పనిసరిగా రాయాల్సిన లెర్నర్ లైసెన్స్ పరీక్ష ను ఇకపై ఇంటి నుంచే రాసే అవకాశాన్ని కల్పించేందుకు తెలంగాణ రవాణా శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం సారథి న్యూ లెర్నర్ లైసెన్స్ పరీక్ష విధానంతో పాటు ఏఐ ఆధారిత సాంకేతికతను పరిశీలిస్తోంది. ఈ కొత్త విధానంలో అభ్యర్థి ముఖాన్ని గుర్తించే ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికత ద్వారా వ్యక్తిగత ధ్రువీకరణ చేపట్టనున్నారు. పరీక్ష సమయంలో అక్రమాలకు పాల్పడితే తక్షణమే గుర్తించేలా ప్రత్యేక వ్యవస్థలను రూపొందించారు. ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతమైతే వారం రోజుల్లోనే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని రవాణాశాఖ భావిస్తోంది.ప్రస్తుతం లెర్నర్ లైసెన్స్ పరీక్ష రాయాలంటే అభ్యర్థులు సంబంధిత రవాణా కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త విధానం అమల్లోకి వస్తే ఈ ఇబ్బందులు తగ్గనున్నాయి. ఇంటి నుంచే కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుంది. అయితే పరీక్ష పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సురక్షితమైన బ్రౌజర్, రియల్‌టైమ్ అభ్యర్థి ధ్రువీకరణను తప్పనిసరి చేయనున్నారు. పరీక్ష సమయంలో అభ్యర్థి కెమెరా ముందు కనిపించకపోయినా, మధ్యలో వేరే వ్యక్తి వచ్చినా, సాంకేతిక అవాంతరాలు ఎదురైనా వ్యవస్థ వెంటనే హెచ్చరికలు జారీ చేస్తుంది. ఇతర వెబ్‌సైట్లను తెరిచేందుకు ప్రయత్నించినా నిఘా వ్యవస్థ గుర్తిస్తుంది.పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలతో లాగిన్ కావాలి. అనంతరం ఫేషియల్ వెరిఫికేషన్ ద్వారా అభ్యర్థి గుర్తింపును నిర్ధారిస్తారు. పరీక్ష జరుగుతున్నంతసేపు ఏఐ ఆధారిత వ్యవస్థ అభ్యర్థి కదలికలను పర్యవేక్షిస్తుంది. ఫేషియల్ వెరిఫికేషన్ పలుమార్లు విఫలమైతే ఓటీపీ పంపిస్తారు. ఆ ఓటీపీని నమోదు చేసిన తర్వాత అభ్యర్థికి సమీపంలోని ఆర్టీవో కార్యాలయానికి వెళ్లి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు.పరీక్షలో ప్రశ్నల స్థితిని సులభంగా గుర్తించేందుకు రంగుల విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు. ఒక ప్రశ్నకు సమాధానం నమోదు చేస్తే గ్రీన్ రంగులో కనిపిస్తుంది. ప్రశ్నను చూసి సమాధానం ఇవ్వకపోతే రెడ్ రంగు, ఇంకా చూడని ప్రశ్నలకు వైట్ రంగు కనిపిస్తుంది.

దీంతో అభ్యర్థులు ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు, ఎన్ని ప్రశ్నలు మిగిలిపోయాయో సులభంగా తెలుసుకోవచ్చు.పరీక్ష పూర్తయిన వెంటనే అభ్యర్థి ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించారో ఫలితం వెల్లడవుతుంది. పరీక్షలో అర్హత సాధించిన వారికి తక్షణమే క్యూఆర్ కోడ్‌తో కూడిన లెర్నర్ లైసెన్స్ (ఒఒఖీ) జారీ అవుతుంది. ఈ విధానం అందుబాటులోకి వస్తే రవాణా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గడంతో పాటు సమయం ఆదా కానుంది. అదే సమయంలో సాంకేతిక నిఘా ద్వారా పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని రవాణాశాఖ భావిస్తోంది.

ఏపీ లిక్కర్ స్కామ్‌లో అంబటికి ఈడీ సమన్లు..

విచారణకు హాజరుకావాలని ఆదేశం

మద్యం రవాణా టెండర్ల కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలు

హైదరాబాద్ కార్యాలయంలో విచారణకు హాజరు

కావాలని అంబటికి ఈడీ నోటీసులు

అనారోగ్య కారణాలతో గతంలో విచారణకు హాజరుకాని అంబటి



హైదరాబాద్ వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా టెండర్ల కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్ల విధానాన్ని మార్చడం ద్వారా భారీగా అక్రమాలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 200 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే అంబటి రాంబాబుకు నోటీసులు పంపింది. అయితే, తనకు ఇటీవల గుండెకు స్టెంట్లు వేశారని, ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు తప్పక హాజరవుతానని అంబటి గతంలో ఈడీకి సమాచారం ఇచ్చారు. ఈడీ నోటీసుల వెనుక రాజకీయ కక్ష సాధింపు ఉందని ఆయన ఆరోపిస్తున్నారు. తనను బెదిరించాలని చూస్తున్నారని, అయితే తాను భయపడబోనని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో అంబటి అనుచరులుగా భావిస్తున్న మర్రి సుబ్బారెడ్డి, రాయపాటి పురుషోత్తంలను ఈడీ ఇప్పటికే సుదీర్ఘంగా విచారించింది. విచారణకు హాజరయ్యేటప్పుడు పాన్ కార్డ్, ఆధార్, పాస్‌పోర్ట్‌తో పాటు 2019 నుంచి కుటుంబ సభ్యుల పేరిట ఉన్న కంపెనీలు, బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకురావాలని ఈడీ తన నోటీసుల్లో పేర్కొంది. ఈడీ ఆదేశాలతో ఈ కేసులో తదుపరి ఏం జరగనుందనే విషయంపై ఆసక్తి నెలకొంది.

పులివెందులలో వైసీపీ పోలింగ్ ఏజెంట్లను తరిమికొట్టారు సతీశ్ కుమార్ రెడ్డి

పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్న సతీశ్ రెడ్డి

చివరకు జగన్ ను కూడా ఇబ్బంది పెట్టారని ఆవేదన

వైసీపీపై కూటమి ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని మండిపాటు

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్... ముఖ్యంగా పులివెందులలో, తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అధికార కూటమి ప్రభుత్వం రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో మాట్లాడుతూ అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పులివెందులలో తమ పార్టీ ఏజెంట్లను సుమారు 70 పోలింగ్ బూత్‌ల నుంచి తరిమికొట్టి యథేచ్ఛగా రిగ్గింగ్ చేశారని ఆయన ఆరోపించారు. ఎన్నికల సరళిని కవర్ చేయడానికి వెళ్లిన 'ఇండియా టుడే' జర్నలిస్టులు అబ్దుల్ బషీర్, వీడియో జర్నలిస్ట్ విజయ్‌పై అధికార పార్టీ వర్గాలు దాడి చేసి కెమెరాను ధ్వంసం చేశాయని ఆయన మండిపడ్డారు. పులివెందులలో టీడీపీ గూండాల దాడిన తీవ్రంగా ఖండిస్తున్నానని సతీశ్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి వైసీపీపై కూటమి ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరించిందని మండిపడ్డారు. పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లు ఉంటే... 70 బూత్‌ల నుంచి వైసీపీ ఏజెంట్లను తన్ని తరిమేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఎన్నికల



సంఘం, ప్రభుత్వం ఏకమై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. చివరకు తమ పార్టీ అధినేత జగన్ ను కూడా ఇబ్బంది పెడుతున్నారని సతీశ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇది అత్యంత ప్రమాదకరమని చెప్పారు.

డెమోక్రాట్లు గెలిస్తే 'మిస్టర్ వీటో'గా మారిపోతా..

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

డెమోక్రాట్లు గెలిస్తే అన్ని నిర్ణయాలను వీటో చేస్తానన్న ట్రంప్

మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయాలని ఉందని వ్యాఖ్య

రాజ్యాంగం ప్రకారం మూడోసారి

ఎన్నిక కావడం సాధ్యం కాదని అంగీకారం

తన సిబ్బందిపై విచారణలు జరిగితే

ముందస్తు క్షమాభిక్షలు ఇస్తానని వెల్లడి

డెమోక్రాట్లకు అనుకూలంగా ఉన్నాయంటూ సర్వేలను తప్పుబట్టిన ట్రంప్

అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే వారి ప్రతిపాదనలన్నింటినీ వీటో చేస్తానని హెచ్చరించారు. మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని, అయితే రాజ్యాంగ నిబంధనలు అందుకు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నారు. న్యూయార్క్ పోస్ట్ కాలమిస్ట్ మిరాండా డివైన్‌తో 'పాడ్ ఫోర్స్ వన్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ ఓటమి ఎదురైతే.. 'మిస్టర్ వీటో'గా మారతానని అన్నారు. నెల లేదా రెండు నెలల పాటు వరుసగా వీటోలు వేస్తే డెమోక్రాట్లు చర్చలకు వచ్చి ఒప్పందానికి అంగీకరిస్తారని వ్యాఖ్యానించారు. మూడోసారి పోటీపై ఆసక్తి: మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం వస్తే తప్పకుండా బరిలో ఉండాలని ఉందని ట్రంప్ చెప్పారు. అయితే రాజ్యాంగంలోని నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయని అంగీకరించారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా ఎన్నికవడానికి వీల్లేదు. ట్రంప్ 2016, 2024 ఎన్నికల్లో విజయం సాధించారు.ముందస్తు క్షమాభిక్షలు ఇస్తా: కాంగ్రెస్‌పై డెమోక్రాట్లు పట్టు సాధించి తనకు పనిచేసినవారిపై విచారణలు ప్రారంభిస్తే.. వారికి ముందస్తు క్షమాభిక్షలు ఇచ్చేందుకు సిద్ధమని ట్రంప్ వెల్లడించారు. గతంలో జనవరి 6 ఘటనకు సంబంధించి క్షమాభిక్షలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.డెమోక్రాట్లు ఆధిక్యంలో ఉన్నట్లు వెల్లడిస్తున్న సర్వేలను ట్రంప్ కొట్టిపారేశారు. అవి పక్షపాతంతో ఉన్నాయని ఆరోపించారు. రిపబ్లికన్లను సరిగా సర్వే చేయడం లేదని విమర్శించారు. డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్‌తో పాటు భవిష్యత్తులో అధ్యక్ష పదవినీ గెలుచుకుంటే దేశం అంతమవుతుందని హెచ్చరించారు.

నిఖిల కన్నాక్షన్స్ డెవలపర్స్ టీమ్ ను అభినందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైద్రాబాద్ నవంబర్ 3;హైటెక్స్ లో నరేడ్కో ఆధ్వర్యం లో మూడు రోజులు నిర్వహించిన రియల్ ఎస్టేట్ ఎగ్జిబిషన్ విజయవంతం ముగిసింది. హైదరాబాద్ లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు. భారీగా స్టాల్స్ ఏర్పాటు చేసి తమ సంస్థలు అందిస్తున్న భారీ ఆఫర్లను కస్టమర్లకు తెలియచేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి నిఖిల కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ స్టాల్ ను సందర్శించి నిర్వహిస్తున్న ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిఖిల కన్స్ట్రక్షన్ ఎండి శ్రీనివాసరావు కిషన్ రెడ్డితో మాట్లాడుతూ మోకిలా అతిపెద్ద ప్రాజెక్టు చీజన రాయల్ పెవిలియన్, ఎన్ సి డి సాయి పల్లవి ఎల్లేట్, ప్రత్యేకమైన ధర తగ్గింపు తో పాటు నాణ్యమైన , ఆధునికమైన పరికరాలను ఉపయోగిస్తూ ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపడుతున్నామని మిగతా కంపెనీలతో పోలిస్తే తాము అతి తక్కువ సమయంలో నిర్మాణాలను పూర్తి చేసి కస్టమర్లకు సరసమైన ధరలకు అందిస్తున్నామని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ భూ వివాదాల తగ్గించి పెట్టుబడిదారులు, బిల్డర్లు, డెవలపర్స్ లో నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. తద్వారా హైదరాబాద్ దేశంలోనే విశ్వసనీయమైన రియల్ ఎస్టేట్ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రియల్ ఎస్టేట్ సంస్థలు కరీంనగర్, నిజాంబాద్, వరంగల్, వంటి నగరాలకు విస్తరించాలని తెలిపారు. నిఖిల కన్స్ట్రక్షన్స్ ఎండి .శ్రీనివాసరావు వారి బృందాన్ని సత్కరించి మొమెంటో అందజేశారు. యువ పారిశ్రామికవేత్త యశ్వంత్ ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ అంటే ఏంటో అమిత్ షా అర్థం చెప్పాలి

సంగిశెట్టి జగదీశ్వర్ రావు...టీపీసీసీ ఉపాధ్యక్షుడు



హైద్రాబాద్ నవంబర్ 3:ప్రజాస్వామ్య పరిరక్షణ అంటే ఏంటో అమిత్ షా అర్థం చెప్పాల టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిసంగిశెట్టి జగదీశ్వర్ రావు డిమాండ్ చేశారు.మంగళవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లోమాట్లాడుతూ

దోంగే దొంగ అన్నట్లు ఉంది అమిత్ షా వాఖ్యలు ఉన్నాయని అన్నారు.

విదేశీయుల ఓట్లు తొలగించండి తప్పలేదు... కానీ ఆ ముసుగులో దేశ ప్రజల ఓట్లుతొలగించకండన్నారు.నోట్ల రద్దు తొ ఉగ్రవాదం అంతం అవుతుంది అన్నారు... అంతం అయ్యారా.

అదాని పోర్టు లొ హెరాయిన్ దొరికితే అమిత్ షా ఏం చేస్తున్నారు.

లోక్ తంత్ర్ బచావో అన్న మీకు... మణీపూర్ మహిళల పై జరిగిన అఘాయిత్యాలు కనిపించలేదా.

అవినీతి గురించి అమిత్ షా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.దేశంలో ఉన్న అవినీతి పరులు అంతా బీజేపీ లోనే ఉన్నారు.

జనగణనలో కుల గణన చేస్తామని అబద్దపు హామీ ఇచ్చి బీసీ లను మోసం చేసారు.

రాంలీలా మైదానంలో సమరశంఖం పూరించాం , వచ్చేది మా ప్రభుత్వమే..

అమిత్ షా సద్దుకునే సమయం వచ్చిందన్నారు.

ఘనంగా ఇండీ కామిక్స్ ఫెస్ట్



హైద్రాబాద్ నవంబర్ 3:ఈ సంవత్సరం ఇండీ కామిక్స్ ఫెస్ట్ హైదరాబాద్ అద్భుతంగా రెండవ సారి జరిగింది! సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఈ ఉత్సవం కామిక్ అభిమానులకు పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిందని ఈ సందర్భంగాICF హైదరాబాద్ చాప్టర్ ఆర్గనైజర్ లికిత్ కుమార్ తిరుకోవెల తెలిపారు.



ఈ ప్రదర్శన వల్ల పిల్లల్లో, మరియు స్టోరీ టెల్లింగ్ ప్రొఫెషనల్స్ వారి నైపుణ్యాన్ని కూడా వృద్ధి చెందుతున్నారు. అన్నారు.

ఒక నాన్-ప్రాఫిట్ వేదిక అయిన ఈ ఇండీ కామిక్స్ ఫెస్ట్ (ICF) ప్రతి సంవత్సరం బెంగళూరు, ఢిల్లీ, ముంబై, కొచ్చి వంటి పలు నగరాలలో జరుగుతూ, దేశవ్యాప్తంగా ఉన్న కామిక్ కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతిభావంతులైన ఆర్టిస్టులు తమ సృజనాత్మక కామిక్ పుస్తకాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

ఇది అభివృద్ధి చెందుతున్న కళాకారులు, విద్యార్థులు, అలాగే వృత్తిపరులకూ తమ ప్రతిభను ప్రదర్శించుకునే ఉత్సాహభరితమైన వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా కామిక్స్ రచన, స్కెచింగ్, ఐడియేషన్ వంటి అంశాలపై ఒక సరదా మరియు ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ కూడా నిర్వహించబడి, పాల్గొన్నవారిలో సృజనాత్మకతను రగిలించాయి. మరొక వర్క్‌షాప్ అకర్మా వాళ్ళు మెట్ల బావుల సంరక్షణ మరియు నిర్వహణ పై నిర్వహించారు.

ఇండీ కామిక్స్ ఫెస్ట్ హైదరాబాద్--- సృజనాత్మకత, కళ, కథల పండుగగా నగర హృదయంలో కొత్త ఊపిరి నింపింది!

ఐడిబిఐ బ్యాంకును ప్రైవేటుపరం చేసే యోచనను విరమించుకోవాలి

జాతీయ బిసి కమిషన్ చెర్ పర్సన్ స్వాతి నిరంజన్ జ్యోతికి వినతి పత్రం

లాభాల బాట నడుస్తున్న ఐడి బ్యాంకు ప్రైవేట్ వరం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలకు వెనుకాడబోము

బీసీ బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య హెచ్చరించారు

హైద్రాబాద్ నవంబర్ 3;ఐడిబిఐ బ్యాంకును ప్రైవేటుపరం చేసే యోచనను విరమించుకోవాలని బీసీ బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య విజ్ఞప్తి చేశారు ఈ మేరకు జాతీయ బిసి కమిషన్ చెర్ పర్సన్ స్వాతి నిరంజన్ జ్యోతిని కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అల్లం యాదయ్య మాట్లాడుతూఐడిబిఐ బ్యాంకులో ప్రైవేటుపరం చేస్తున్నారని, ఐడిబిఐ ఉద్యోగులు దాదాపు పదివేల మంది ఉద్యోగులు రోడ్డు మీద పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. లాభాల బాట నడుస్తున్న ఐడి బ్యాంకు ప్రైవేట్ వరం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. డిసెంబర్ లో జరుగు బీసీ ఉద్యోగుల సమావేశంలో దీనిమీద విస్తృతంగా చర్చించి ప్రధానమంత్రిని రాష్ట్రపతిని మరియు ఫైనాన్స్ మినిస్టర్ కలిసి కలిసి వినతి పత్రము సమర్పించనున్నట్లు తెలిపారు. స్వాతి నిరంజన్ జ్యోతిని కలిసిన వారిలో ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాసరావు తెలంగాణ రాష్ట్రం అధ్యక్షులు కురుమ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్.జె.డి నేత తేజస్వినీ యాదవ్ కు ఘన స్వాగతం



హైద్రాబాద్ నవంబర్ 3;ఈ నెల 4 న ఎన్టీఆర్ స్టేడియం లో జరిగే సదర్ కార్యక్రమంలో పాల్గొన్నడానికి నగరానికి విచ్చేసిన బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్.జె.డి నేత తేజస్వినీ యాదవ్ ను రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ లో కలసిన బీసీ ఎం.పీల ఫోరం మాజీ కన్వీనర్ వి.హనుమంతరావు, ఎంపీలు సురేష్ షెట్కర్, అనిల్ కుమార్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ ఇతర నాయకులు..

గ్రీన్ ఇండియా ఛాలెంజ్

బంజారాహిల్స్ లో మొక్కలు నాటిన బిగ్ బాస్ 10 కాంటెస్టెంట్ సింగర్ ఝాన్సీ

హైదరాబాద్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా బిగ్ బాస్ 10 కాంటెస్టెంట్ సింగర్ ఝాన్సీ బంజారాహిల్స్ లో మొక్కలు నాటారు. ఝాన్సీ మాట్లాడుతూ బిగ్ బాస్ నుండి బయటకు రాగానే ప్రకృతి తో ముడిపడి ఉన్న నాకు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్క నాటడం చాలా ఆనందంగా ఉంది అన్నారు.మట్టిని తాకిన మనసుకు అనే పాటను పాడి మొక్కను నాటడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.సకల జీవ రాషుల మనుగడకు మొక్కలు ఎంతో అవసరం అని వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మన మీదే ఉందని అన్నారు.మొక్కలు నాటి వాటిని రక్షన చేస్తేనే రేపటి తరాలకు మంచి వాతావరణం ఇచ్చిన వాళ్ళము అవుతాము అన్నారు. నీళ్లనే కొనుక్కోవాల్సిన అవసరం వస్తది అని ఎవరు అనుకోలేదు కానీ వచ్చింది అని ఆక్సీజన్ కొనుక్కునే పరిస్థితి రేపటి తరాలకు రావద్దు అంటే మొక్కలు నాటాలి అన్నారు.ఇంతటి గొప్ప కార్యక్రమం చేపట్టిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, నిరంజన్ పూలే తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాల్లో విషపదార్థాలు ప్రజారోగ్యానికి పెనుసవాలు

(హెచ్. ప్రతాప్)

తెలంగాణలో భూగర్భజలాలు కేవలం అడుగంటిపోవడమే కాదు, కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర రసాయనాలతో కలుషితమవుతున్నాయి. తాగునీటి కోసం బోరుబావులపై ఆధారపడుతున్న కుటుంబాలకు ఇది ఆందోళనకర పరిణామం. కేంద్ర భూగర్భజల మండలి తాజా నివేదికలో వెల్లడైన అంశాలు నీటి లభ్యతతోపాటు నాణ్యతకూ అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్, యురేనియం, ఇనుము, మాంగనీస్ నిర్ణీత పరిమితులను మించినట్లు పరీక్షల్లో వెల్లడైంది. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో కొన్ని నమూనాల్లో నైట్రేట్ సాంద్రత లీటరుకు 45 మిల్లీగ్రాముల పరిమితికంటే నాలుగైదు రెట్లు అధికంగా నమోదైంది. నల్గొండ, నిర్మల్, మహబూబ్‌నగర్, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్, యురేనియం అధిక స్థాయిలు గుర్తించారు.

2025 నివేదిక ప్రకారం తెలంగాణలో పరిశీలించిన 1,114 నీటి నమూనాల్లో 290 నమూనాల్లో నైట్రేట్, 167 నమూనాల్లో ఫ్లోరైడ్ నిర్ణీత పరిమితులను మించాయి. ఈ గణాంకాలు కలుషిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని దీర్ఘకాలం తాగడం వల్ల దంతాలు, ఎముకలకు సంబంధించిన ఫ్లోరోసిస్ సమస్యలు తలెత్తవచ్చు. నైట్రేట్ అధికంగా ఉండటం ముఖ్యంగా శిశువులకు ప్రమాదకరం. యురేనియం అధిక మోతాదులో దీర్ఘకాలికంగా శరీరంలోకి చేరితే మూత్రపిండాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.భూగర్భజలాల కలుషితానికి సహజ భౌగోళిక పరిస్థితులతోపాటు మురుగునీరు భూమిలోకి ఇంకడం, రసాయన ఎరువుల అధిక వినియోగం, వ్యర్థాల అశాస్త్రీయ నిర్వహణ కారణమవుతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిసినా నీటిలోని హానికర పదార్థాలు తప్పనిసరిగా తగ్గిపోవు. అందువల్ల నీటిమట్టం పెరగడమే సురక్షిత తాగునీటికి హామీ కాదు.

ప్రతి గ్రామంలో, పట్టణంలో భూగర్భజలాల నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలి. పరీక్షా ఫలితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కలుషిత ప్రాంతాల్లో శుద్ధిచేసిన తాగునీటిని అందించడంతోపాటు మురుగునీటి నిర్వహణను మెరుగుపరచాలి. బోరుబావుల నీరు స్వచ్ఛంగా కనిపించినంత మాత్రాన తాగడానికి సురక్షితమని భావించకూడదు. సాధారణంగా నీటిని మరిగించడం వల్ల ఫ్లోరైడ్, నైట్రేట్, యురేనియం తొలగిపోవు.నీరు సమృద్ధిగా ఉండటం అభివృద్ధికి అవసరం. ఆ నీరు ఆరోగ్యకరంగా ఉండటం మనుగడకు అత్యవసరం. భూగర్భజలాల సంరక్షణను కేవలం పర్యావరణ కార్యక్రమంగా కాకుండా ప్రజారోగ్య పరిరక్షణలో ప్రధాన బాధ్యతగా గుర్తించాలి. కలుషిత నీటిని గుర్తించడం మొదటి అడుగైతే, ప్రతి కుటుంబానికీ సురక్షిత తాగునీరు అందించడం అంతిమ లక్ష్యం కావాలి.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ పి. బాబన్‌కు భారీ ఆధిక్యం....

నంద్యాల మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం ప్రారంభం కాగా, తొలుత లెక్కించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ పి. బాబన్ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచారు, మొత్తం పోలైన 460 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ పి. బాబన్ 318 ఓట్లను కైవసం చేసుకుని తన సమీప ప్రత్యర్థిపై 208 ఓట్ల భారీ ఆధిక్యంతో ముందంజలో నిలిచారు, వైసీపీ అభ్యర్థి షేక్ అమీర్ బాషాకు 110 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మహమ్మద్ ఇద్రిస్‌కు 7 ఓట్లు రాగా, ఇండిపెండెంట్ అభ్యర్థులు అవ్వారి ఎల్ల సుబ్బారాయుడుకు 1, గిరిబోయిన శారదకు 2, పున్నా శేషయ్యకు 9, బచ్చన్నగారి నూర్ బాషాకు 2, షేక్ మహమ్మద్ రఫీకి 1 ఓటు వచ్చాయి, ఈ లెక్కింపులో 2 ఓట్లు తిరస్కరణకు గురికాగా, 8 ఓట్లు నోటాకు నమోదయ్యాయి, పోస్టల్ బ్యాలెట్‌లోనే టీడీపీ భారీ ఆధిక్యం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

శబరిమలకు జహీరాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు

అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక సౌకర్యాలు..

గురుస్వామికి ఉచిత ప్రయాణం

జహీరాబాద్, నవంబర్ 3 ప్రజాబలం ప్రతినిధి: శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థం జహీరాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేశ్వరి తెలిపారు. ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు శబరిమలకు వెళ్లే నేపథ్యంలో వారి ప్రయాణాన్ని సౌకర్యవంతంగా, సురక్షితంగా మార్చేందుకు ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.



ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే భక్తులకు ఆర్టీసీ పలు ఉచిత సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. ప్రతి బస్సులో ఒక గురుస్వామికి ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుందని, ఇద్దరు వంట మనుషులు సీట్లు లేకుండా ఉచితంగా ప్రయాణించవచ్చని వివరించారు. పదేళ్లలోపు ఇద్దరు మణికంఠ అయ్యప్పలకు కూడా సీట్లు లేకుండా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. యాత్రలో భాగంగా భక్తుల విశ్రాంతి, భోజన అవసరాలకు అనుగుణంగా బస్సులను నిలిపే ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. భక్తులు కోరుకున్న ఇతర పుణ్యక్షేత్రాలను కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామన్నారు. అంతేకాకుండా భక్తుల సౌకర్యార్థం వారి ఇళ్ల వద్ద నుంచే బస్సు ప్రయాణాన్ని ప్రారంభించే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో సురక్షితంగా శబరిమల యాత్రను పూర్తి చేసుకోవాలని డిపో మేనేజర్ రాజేశ్వరి కోరారు. బస్సుల బుకింగ్, ఇతర వివరాల కోసం డిపో మేనేజర్ 9959226269, అసిస్టెంట్ మేనేజర్ 8309106357, స్టేషన్ మేనేజర్ 9866268164, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ 9502485185 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆల్గోల్ రోడ్డు సమస్యను పరిష్కరించాలి

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన సర్పంచ్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి



జహీరాబాద్, నవంబర్ 3 ప్రజాబలం ప్రతినిధి: అల్గోల్ అభివృద్ధికి ఆటంకంగా మారిన రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆల్గోల్ సర్పంచ్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత తన్నీరు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన రోడ్డు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై నమ్మకంతో భరోడి వెంకటేశం, టి. లక్ష్మారెడ్డి, చల్లా నరేష్‌రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారికి హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆల్గోల్ సర్పంచ్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు చి. వీరన్న, శ్యామ్, అలోక్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పి. ప్రభాకర్, అనిల్‌కుమార్, సయ్యద్ తాహెర్ అలీ, సంజీవరెడ్డి, బాల్‌రాజ్, బస్వరాజ్, ముల్తానీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఆల్గోల్ గ్రామ అభివృద్ధి కోసం నాయకులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి. ఆర్థిక సహాయం అందజేసిన కాకుల మర్రి దంపతులు!

ఆదర్శంగా నిలుస్తున్న లక్ష్మణ్ బాబు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 03కష్టంలో ఉన్నవాడికి చేయూత నివ్వడమే అసలైన మానవత్వం" అనే నినాదానికి నిలువెత్తు రూపంగా ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లికాకులమర్రి లక్ష్మణ్ బాబు మరియు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత దంపతులు నిలిచారు.ఏటూరునాగారానికి చెందిన ఎండి అన్వర్ పాషా మేనకోడలి వివాహం ఆర్థిక ఇబ్బందుల నడుమ జరుగుతున్నదనే విషయాన్ని తెలుసుకున్న వారు క్షణం కూడా ఆలోచించలేదు. వెంటనే స్పందించి, ఆ పేదింటి బిడ్డ పెళ్లికి రూ. 15,000/- (పదిహేను వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.



ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ తమ దాతృత్వంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు తాడూరి రఘు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, ఎస్.కె అమ్ములు బేగం బాబా, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజరావు, పెద్ద బోయిన బాలకృష్ణ, లంబడిగూడెం సర్పంచ్ పోరిక సరిత శ్రీనివాస్, ఆకునూరి యశ్వంత్, గంప కిరణ్, పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్ బాబు ని కలిసిన జాతీయ బీసీ వెల్ఫేర్ కార్యదర్శి అందే శ్రీశైలం కురుమ

హైద్రాబాద్ నవంబర్ 3;రాష్ట్ర ఐ టి శాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబు ని జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి అందే శ్రీశైలం కురుమ సచివాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు

భూభారతి పెండింగ్ దరఖాస్తులు.. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలి

భూ పరిపాలన ప్రధాన కమిషనర్,

రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 03 ములుగు ంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల రెవెన్యూ అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, రీసర్వే, హైకోర్టు కేసులు, భూభారతి పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులు, భూసేకరణ, భూముల క్రమబద్ధీకరణ అంశాలపై ఆయన సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి





జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. పాత, కొత్త దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.
రీసర్వేను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేందుకు ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ వేగంగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.
జీవో నంబర్లు 59, 76 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. యూఎల్‌సీ భూములు, జీవో నంబర్ 118కు సంబంధించిన పెండింగ్ అంశాలపైనా సమీక్షించారు.
హైకోర్టు పరిధిలో ఉన్న భూ సంబంధిత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాల పురోగతిని సమీక్షించారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఏవో రాజ్‌కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, మంజుల, తహసీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బి ఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు ను పరామర్శించిన మంగపేట బి ఆర్ఎస్ పార్టీ మండల నాయకులు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 03ఏటూరు నాగారం మంగళవారం బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులులక్ష్మణ్ బాబు తన సొంత నివాసమైన ఏటూరునాగారానికి రాగా. బి ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుని పరామర్శించడానికి మంగపేట మండలనికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు వారి నివాసానికి వెళ్లి వారిని పలకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసు కున్నారు



ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ లక్ష్మణ్ బాబు త్వరగా కోలుకోవాలని మునుపటిలా మళ్లీ ప్రజా క్షేత్రంలో అడుగు పెట్టాలని లిప్రజల మధ్యలో మళ్లీ తన పయనం సాగించాలని ఆ భగవంతున్ని వేడుకున్నరు

భూసార పరిరక్షణతోనే అధిక దిగుబడులు

ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన

మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి

కొల్చారం, నవంబర్ 03 (ప్రజాబలం): ప్రతినిధిభూసారాన్ని కాపాడుకుంటూ పంటల సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి రైతులకు సూచించారు. కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ లతా శ్రీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భూసుపోషణ, భూసంరక్షణపై 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువులు, సూక్ష్మపోషకాలను వినియోగిస్తూ సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. తద్వారా భూసారం పెరిగి నేల ఆరోగ్యం కాపాడబడుతుందని వివరించారు. అలాగే మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానం, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను అందించి, సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూమేష్, నాయకులు, రూప్లా నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ జిహెచ్ఎంసి డైరెక్టర్ ఆస్తులపై ఏసీబీ సోదాలు

సూర్యాపేట లో ఉన్న హైదరాబాద్ అసిస్టెంట్ జిహెచ్ఎంసి డైరెక్టర్ నల్లబోతు యాదగిరి ఇంటిపై ఏసీబీ సోదాలు జరిపింది. పలు ప్రాంతాల్లో ఉన్న యాదగిరి ఆస్తులపై ఏసీబీ రాష్ట్ర జరుపుతోంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లో నివాసం వుంటున్నారు..

మాన్సాన్‌పల్లిలో పగటిపూట ఇంటి దొంగతనం కేసును ఛేదించిన జోగిపేట పోలీసులు

నిందితుడి అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 03



(ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా: జోగిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అందోల్ మండలం మాన్సాన్‌పల్లి, గ్రామంలో 30-10-2026వ తేదీన పగటిపూట జరిగిన ఇంటి దొంగతనం కేసును జోగిపేట పోలీసులుఛేదించారు. మాన్సాన్‌పల్లికి,చెందిన పిట్ల శ్రీశైలం, కుటుంబ సభ్యులతో కలిసి నిశ్చితార్థ వేడుకకు వెళ్లిన సమయంలో, అతని మేనల్లుడైన సారా చంద్రశేఖర్, (19) ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి, ఇంటి తాళాలు మరియు బీరువాతాళాలు పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించాడు.సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు, 02-11-2026న సదాశివనగర్ గ్రామంలో అతడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి చోరీకి గురైన సొత్తును స్వాధీనం స్వాధీనం చేసుకున్న సొత్తు:2, తులాల బంగారు బిస్కెట్.అరతులం బంగారుఉంగరం.30,తులాల వెండిపట్టీలు(ఒక జత)1,తులం బంగారు కమ్మలు.దొంగతనానికి ఉపయోగించినద్విచక్రవాహనం,,నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచడం జరిగింది

మంత్రిపై అసత్య ఆరోపణలు,ఖండించిన చిట్టిబాబు

ఆందోల్- జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 03 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా దేశ రాజధాని ఢిల్లీ లోని ప్రముఖ శాంగ్రిలా హోటల్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ , జుక్కల్, నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మధ్య వాగ్వాదం జరిగిందంటూ మీడియాలో వస్తున్న కథనాలను అందోల్-జోగిపేట మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) తీవ్రంగా ఖండించారు, ఈ మేరకు ఆయన స్పందిస్తూ మంత్రి దామోదర రాజనర్సింహ,పై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని కొట్టిపారేశారు,

ఈ సందర్భంగా ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ, "మా నాయకుడి పైన లేనిపోని వార్తలు ఎవ్వరూ నమ్మరు" ఏదైనా అభివృద్ధి పైన గానీ, సంక్షేమ పథకాల పైన చర్చ పెడితే బావుంటుంది, కానీ అందోల్ నియోజకవర్గంలో రూ, 2,000,కోట్లకు పైబడి అభివృద్ధి పనులు సాగుతున్నాయి,అది మనందరికీ తెలుసు. పండ్లు ఉన్న చెట్టుకే రాళ్లు పడతాయి, ఆయన సహనం, ఓర్పు, క్రమశిక్షణ చూసి నేర్చుకోవాలి, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే గుణం ఉండాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు దామోదర నేర్పించారు, ఇలాంటి ఆరోపణలు రావడం సరికాదు, అని పేర్కొన్నారు,

అలాగే రాజకీయ నాయకుల తీరును తప్పుపడుతూ తీవ్రంగా హెచ్చరించారు,దయచేసి లేనిదానిని ఉన్నట్టుగా చూపించడం కొంతమందికి వెన్నతో పెట్టిన విద్య కాబట్టి ఇక చాలు మిత్రులారా! బీఫాం ఇచ్చిన నాయకుడి మీదనే బుసలు కొడతారా? ఖబర్దార్! బీఫాం ఇచ్చి రాజకీయంగా నిలబెట్టిన నాయకుడి గౌరవం మరిచి మాట్లాడితే ఎట్లా? దామోదర్ రాజనర్సింహా, అవకాశం ఇచ్చి రాజకీయంగా ఎదిగిస్తే, ఇప్పుడు అదే నాయకుడి మీద రాజకీయాలు చేస్తారా?" అంటూ మండిపడ్డారు,రాజకీయాల్లో ఎదగడం, పదవులు అనుభవించడం సహజమని, కానీ ఎదిగేందుకు బాటలు వేసిన నాయకుడి గౌరవాన్ని ఎప్పటికీ మరిచిపోకూడదని హితవు పలికారు. "గుర్తుంచుకోండి" బీఫాం ఇవ్వడం నాయకుడి గొప్పతనశీ, గెలిపించుకోవడం



ప్రజల గొప్పతనం,ఎదిగాక కృతజ్ఞత మర్చిపోవడం మాత్రం రాజకీయ అహంకారం! ఖబర్దార్! మా నాయకుడి గౌరవం మీద చేయి పెడితే ఊరుకునేది లేదు! దామోదర్ రాజనర్సింహ, నాయకత్వాన్ని విమర్శలతో తగ్గించలేరు, ఆయన అభిమానుల ఆత్మగౌరవాన్ని తక్కువ అంచనా వేయలేరు,అని వైస్ ఛైర్మన్ ఆకుల సత్యనారాయణ హెచ్చరించారు

వారసత్వ కట్టడాల పరిరక్షణలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలి

రామప్ప విశిష్టతపై విస్తృత అవగాహన కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 03 మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్--2026 ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, శ్రీధర్ రావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.





ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చరిత్ర, పురావస్తు, వారసత్వ కట్టడాల సంరక్షణపై ఆసక్తితో శిక్షణకు హాజరైన వాలంటీర్లను అభినందించారు. రామప్ప దేవాలయ విశిష్టతను, శిక్షణలో తెలుసుకున్న అంశాలను మరింత మందికి తెలియజేయాలని సూచించారు. వారసత్వ కట్టడాల పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలని అన్నారు.

పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ శిబిరాలు యువతకు కెరీర్‌పరంగా ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలిని తెలుసుకునేందుకు ఇవి అవకాశం కల్పిస్తాయన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇతరులకు తెలియజేస్తూ కాకతీయుల కీర్తిని ప్రపంచానికి చాటేలా వాలంటీర్లు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ చల్లగొండ రాజు,పర్యాటక శాఖ గైడ్లు గోరంటల విజయ్ కుమార్, వెంకటేష్, రాష్ట్ర పురావస్తు శాఖ ఫోర్‌మన్ బాబు, టూరిస్ట్ పోలీసులు అరుణ్, భద్రు, సంబంధిత శాఖల సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 3(ప్రజాబలం) వికారాబాద్జిల్లా: మర్పల్లిమండలం పట్లూర్ గ్రామంలో నిర్వహించిన పట్టభద్రుల ఎం ఎల్ సి ఓటర్ నమోదు సమీక్ష కార్యక్రమంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా"మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎం ఎల్ సి ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు సూచించారు. ఓటర్ నమోదు అత్యధిక సంఖ్యలో





పట్టభద్రులు నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం మర్పల్లి మండలం తుమ్మలపల్లిగ్రామంలో బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై, పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణతో పాటు పట్టభద్రుల ఎంఎల్సి ఓటర్ నమోదుపురోగతిపై చర్చించారు.

ప్రతి గ్రామంలోని అర్హులైన పట్టభద్రులు ఎం.ఎల్.సిఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాల వారీగా ఇంచార్జీలకు బాధ్యతలు అప్పగించినమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రతి గ్రామంలో పట్టభద్రుల నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మర్పల్లి మాజీ మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటి సి మధుకర్,



మాజీ ఎంపీపీబట్టు లలితరమేష్, మోహన్ రెడ్డి, పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్, మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు పడమటి శ్రీనివాస్,తుమ్మలపల్లి సర్పంచ్ రాజు, తుమ్మలపల్లి పెద్దలు యువకులు సమావేశంలో పాల్గొన్నారు అదేవిధంగా సిరిపురం రమేష్, సోహిన్ షరీఫ్, అంజయ్య గౌడ్, విలేజ్ ప్రెసిడెంట్ జి అశోక్,యువ నాయకులు షఫీ యో దిన్, మరియుటిఆర్ఎస్ కుటుంబ సభ్యులు తదితరు లు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు

ముదిరాజులని బీ సి ఏ లో చేర్చే ప్రతిపాదన రద్దు చేయాలని డిప్యూటీ ఎమ్మార్వో కు వినతి పత్రం



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 03 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా బీసీఏ జాబితాలో 57 కులాల హక్కుల పరిరక్షణ దృశ్య, (బి సి డి) జాబితాలో సీరియల్ నెంబర్ 19,లో ఉన్న ముదిరాజులని(బీ సి ఏ) లో చేర్చే ప్రతిపాదన రద్దు చేయాలని, పుల్కల్ మండల డిప్యూటీ ఎమ్మార్వో కు, వినతి పత్రం ఇవ్వడం జరిగింది,(బి సి ఎ)లోని 57, కులాల హక్కుల ప్రయోజనాలు దెబ్బ తినకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ముదిరాజ్ కులాన్ని(బీసీఏ) లో చేర్చే ప్రతిపాదన విరమించుకోవాలని , (బీసీఏ) కులాల వెనుక విధానాన్ని పరిగణలోకి తీసుకొని, ఆయా కులాలకు న్యాయం జరిగేలా చూడాలని, బీసీఏ లోని పేద వెనుకబడిన కులాలకు, ప్రస్తుతం లభిస్తున్న రిజర్వేషన్లు, ప్రయోజనాలు, విద్యా మరియు ఉద్యోగ అవకాశాలు, కల్పించబడిన చర్యలు తీసుకోవాలని మా విజ్ఞప్తి, మేరకు పరిశీలించి, బీసీ కులాలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు, ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారాం, మండల అధ్యక్షుడు హరీష్ కుమార్, రజక సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్, రజక సంఘం యూత్ అధ్యక్షుడు ప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు రాజు, నాగేష్,రాములు, రాదయ్య కృష్ణయ్య, మారుతి, గణేష్ నరేష్, వివిధ నాయకులు పాల్గొన్నారు.

దార్లపల్లి అంగన్వాడి సెంటర్ లో నాస్టా తినిపించిన గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు



వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి నవంబర్ 3 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం దార్లపల్లి గ్రామంలో అంగన్వాడి చిన్నపిల్లలకు నాస్టా భోజనాన్ని స్వయానా గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజ్ తినిపించడం జరిగిందని తెలిపారు గ్రామంలో ఉన్న అంగన్వాడి సెంటర్ పిల్లలు అందరూ కూడా సెంటర్ కు వచ్చేసి ప్రభుత్వం ఇస్తున్న ఈపథకాన్ని ప్రతి ఒక్క సద్వినియోగం చేసుకోవాలని పిల్లలకు చాలా మంచి ఫుడ్ న్యూట్రిషన్ ఫుడ్ దీనివలన ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు కూడా పిల్లల్ని సెంటర్కు పంపించాలని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్రాజ్ తెలిపారు

తుల్జా భవాని అమ్మవారి ఆశీస్సులు మా రక్ష

పట్లూర్ గ్రామ సర్పంచ్ పరు శురాశీ

వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 3 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పట్లూర్ గ్రామ సర్పంచ్ పరశు రాశీ,తుల్జా భవాని అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమం పూర్తిచేసుకుని తన కుమారుని కుమార్తెను అమ్మవారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో దీవించాలని అమ్మవారి ఆశీస్సులు తీసుకొనుటకు వెళ్లడం జరిగిందని తెలిపారు అమ్మవారి ఆశీస్సులు మా కుటుంబం పైన మా గ్రామం పైన మా మండలం పైన వికారాబాద్ జిల్లా ప్రజల పైన అమ్మవారి ఆశీస్సులు సిరిసంపద లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో దీవించాలని పట్లూర్ గ్రామ సర్పంచ్ పరశురాం తెలిపారు



మర్పల్లి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి మర్పల్లి

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు



వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి నవంబర్ 3(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:మర్పల్లి మండలం అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుతుమ్మల సురేష్ యాదవ్,పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం గురించిమాట్లాడారుహైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు .మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి పెట్టి యువత నమోదు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలోసారించాలని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ సూచించారు.

మిషన్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మహిళలు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 03 కన్నాయిగూడెం తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ పీరీల స్వప్న ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మిషన్ ట్రైనింగ్ సెంటర్

మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిలో నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసి, స్వయం సమృద్ధి సాధించే దిశగా నిర్వహిస్తున్న మిషన్ ట్రైనింగ్ కార్యక్రమం విజయవంతంగా 75 రోజులు పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం.

ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మహిళలు కొత్త విషయాలను నేర్చుకుంటూ, తమలోని ప్రతిభను వెలికితీస్తూ, వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబ ఆర్థిక అభివృద్ధికి కూడా తోడ్పడే దిశగా ముందుకు సాగుతున్నారు.



మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా, సమాజ అభివృద్ధిలోనూ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.75 రోజుల పాటు క్రమశిక్షణతో, పట్టుదలతో శిక్షణలో పాల్గొన్న మహిళలం దరికీ, శిక్షణ అందించిన సిబ్బందికి ప్రత్యేక అభినందనలు.మహిళల అభివృద్ధే గ్రామ అభివృద్ధి. మహిళల సాధికారతే సమాజ ప్రగతికి పునాది.రాబోయే రోజుల్లో కూడా మహిళలు మరిన్ని విజయాలు సాధిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము. కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఇలాంటి

బద్వేలు మున్సిపాలిటీ కూటమి కైవసం..

క్లీన్‌స్వీప్‌తో సంపూర్ణ విజయం

బద్వేలు మున్సిపాలిటీని కైవసం చేసుకున్న టీడీపీ కూటమి

పోలింగ్ జరిగిన ఏకైక వార్డులో టీడీపీ అభ్యర్థి గెలుపు

ఇప్పటికే చైర్‌పర్సన్‌తో పాటు 39 వార్డులు ఏకగ్రీవం

బద్వేలు మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార టీడీపీ కూటమి హవా కొనసాగిస్తోంది. కడప జిల్లాలోని బద్వేలు మున్సిపాలిటీని కూటమి పూర్తిస్థాయిలో కైవసం చేసుకుంది. ఈరోజు జరుగుతున్న ఓట్ల లెక్కింపులో... పోలింగ్ జరిగిన ఏకైక వార్డులోనూ టీడీపీ అభ్యర్థి విజయం సాధించడంతో ఈ క్లీన్‌స్వీప్ పూర్తయింది. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 39వ వార్డుకు జరిగిన ఎన్నికలో టీడీపీ అభ్యర్థి తుడిమెళ్ల విజయ 372 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 40 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో కేవలం ఈ ఒక్క వార్డుకు మాత్రమే పోలింగ్ నిర్వహించారు. మిగిలిన 39 వార్డులు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికలకు ముందే మున్సిపల్ ఛైర్‌పర్సన్ పీఠాన్ని టీడీపీ అభ్యర్థి సోమేశుల దివ్య తేజ ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. ఏకగ్రీవమైన 39 వార్డుల్లో టీడీపీ 35 స్థానాలు, జనసేన 2 స్థానాలు గెలుచుకోగా, మరో రెండు స్థానాలను స్వతంత్ర అభ్యర్థులు దక్కించుకున్నారు. తాజాగా 39వ వార్డులోనూ టీడీపీ గెలవడంతో బద్వేలు మున్సిపల్ కౌన్సిల్‌పై కూటమి సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించినట్లయింది. ఈ విజయంతో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

కొల్చారంలో ఆల్ ఇండియా బంజారా మేళా

ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహణ.. దేశ, విదేశాల నుంచి బంజారా ప్రజల హాజరు

కొల్చారం, నవంబర్ 03 (ప్రజాబలం): ప్రతినిధి మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని వసురాం తండా ఆతిథ్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో కొల్చారంలో ఆల్ ఇండియా బంజారా మేళా నిర్వహించనున్నట్లు బంజారా నాయకులు, వసురాం తండా సర్పంచ్ వినోద్ నాయక్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బంజారామేళా వివరాలను వెల్లడించారు.



ఈ సందర్భంగా వినోద్ నాయక్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో సుమారు నాలుగు లక్షల మంది బంజారా ప్రజల భాగస్వామ్యంతో బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక పరిచయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాకు దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కూడా బంజారా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని పేర్కొన్నారు. బంజారా సంస్కృతి, ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మేళాను విజయవంతం చేసేందుకు బంజారా ప్రజలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సీతారాం తండాకు చెందిన మోహన్ సింగ్, మాజీ ఎంపీటీసీ రామ్ చందర్, అచ్చన్నపల్లి తండా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జగన్ నాయక్, సంగాయిపేట మాజీ ఎంపీటీసీ డి. రాజు, మెదక్ గోర్ సేన అధ్యక్షుడు ఎం. మిట్టు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానేరు గడ్డపై పల్లె పాటల హోరు ,

మార్మోగిన సిరిసిల్ల

సిరిసిల్లలో జానపద జాతర: అట్టహాసంగా తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలు



రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 3(ప్రజాబలం ప్రతినిధి) మానేరు గడ్డ సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ (టీజీఎఫ్ఐ) ఆవిర్భావ వేడుకలు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలను మున్సిపల్ చైర్మన్ జిందం కళా-చక్రపాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకుముందు పాత బస్టాండ్ నుంచి కళాకారులు సాంప్రదాయ వేషధారణ, ఆటపాటలతో నిర్వహించిన భారీ ర్యాలీ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా ఫోక్ ఇండస్ట్రీ ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జానపద కళాకారుల ఐక్యత, సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలుగు చిత్ర పరిశ్రమతో సమానంగా జానపద కళాకారులకు కూడా ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని, వారి కోసం ప్రత్యేకంగా ఫోక్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని





కోరారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కళాకారులు తమ జానపద గీతాలు, నృత్యాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు.

ఈ కార్యక్రమంలో ఫోక్ ఇండస్ట్రీ అధ్యక్షుడు పత్తిపాటి రమణకర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సత్తర్, గౌరవ సలహాదారు దరువు అంజన్న, ప్రముఖ సినీ రచయిత కాసర్ల శ్యామ్, గాయకులు తేలు విజయ, నల్లగొండ గద్దర్, మంకాల ప్రసాద్‌తో పాటు పలువురు సంఘం ప్రతినిధులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి దామోదర బూతు పురాణం

దిగజారుడుతనానికి నిదర్శనం

హైదరాబాద్ ఢిల్లీలోని విలాసవంతమైన హోటళ్లలో సాటి ప్రజాప్రతినిధిపై మంత్రి దామోదర రాజనర్సింహ సాగించిన బూతు పురాణం, బెదిరింపుల పర్వం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ విమర్శించారు.. ఒక సీనియర్ మంత్రి స్థాయిలో ఉండి, ప్రజలచే ఎన్నుకోబడిన జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావు పై అసభ్య పదజాలంతో దూషణలకు దిగడం, రూమ్లోకి తీసుకెళ్లి కొడతానంటూ రౌడీయిజం ప్రదర్శించడం సిగ్గుచేటు. కాంగ్రెస్ పార్టీ నాయకుల నైజం, అహంకారం ఎంతటి దిగజారుడు స్థాయికి చేరాయో ఈ ఘటనతో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టమైందని అన్నారు.సొంత నియోజకవర్గంలో కరెంట్ లేక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరుమున్నీరవుతుంటే, తాగునీరు దొరక్క జనం గొంతెండుతుంటే మంత్రి దామోదరకు పట్టదు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను గాలికొదిలేసి, ఢిల్లీకి వెళ్లి విలాసవంతమైన హోటళ్లలో తందనాలు ఆడుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, కమీషన్లు వచ్చే భవనాలు, కాంట్రాక్టులకే ప్రాధాన్యమిస్తూ దోచుకుంటున్నది చాలదన్నట్లు.. పక్క నియోజకవర్గమైన జుక్కల్లోని ఇసుక రీచ్ల దందా కావాలంటూ సాటి ఎమ్మెల్యేపై ఒత్తిళ్లు తీసుకురావడం, అనుచరులను పంపడం మంత్రి స్వార్థ వ్యాపార దాహానికి నిదర్శనం. ఇసుక దందాను అడ్డుకున్నందుకు ప్రజాప్రతినిధి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం ఏ సంస్కృతని నిలదీసారు.అన్నదాతల గోస పట్టని పాలకులకు ఇసుక దందాలు, కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలు, పంటలపై లేకుండా పోయింది. అధికారం చేతిలో ఉంది కదా అని రౌడీల్లా వ్యవహరిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు. కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి తక్షణమే మంత్రి దామోదర రాజనర్సింహ తీరుపై చర్యలు తీసుకోవాలి. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి సాటి ఎమ్మెల్యేలను బెదిరించే స్థాయికి దిగజారిన మంత్రి ప్రజలకు, జుక్కల్ ఎమ్మెల్యేకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.



Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com